
వాస్తవం డెయిలీ.కామ్
ఉన్నది ఉన్నట్లుగా
డిజిటల్ పత్రిక
బుధవారం 22.07.2026
ఎడిటర్: ఎం.కృష్ణారెడ్డి(కె.ఆర్)

## వార్తలు చదవడం తేలికే... రాయడమే కష్టం

ఏది వార్తనో
ఏది వార్త కాదో
ముందుగా
తెలుసుకోవాలి




11

# ఇంటర్నెట్ లేకున్నా యూపీఐ చెల్లింపులు

### గరిష్ఠంగా రూ.2,000 వరకు అనుమతి




**న్యూఢిల్లీ:** తమ మొబైల్ ఫోన్‌లో ఇంటర్నెట్ లేకున్నా మర్చంట్ పాయింట్ ఆఫ్ సేల్ (పీఓఎస్) వద్ద కస్టమర్లు యూపీఐ చెల్లింపులు చేసే సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చే దిశగా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది. ప్రతిపాదిత విధానం ద్వారా ఫోన్, పీఓఎస్ రెండింటికీ ఇంటర్నెట్ లేకున్నా చెల్లింపులు చేసే అవకాశం కలగనుంది. నియర్ ఫీల్డ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ సదుపాయం ఉన్న ఫోన్‌ను పీఓఎస్ టెర్మినల్ వద్ద టాప్ చేసి యూపీఐ లైట్ బ్యాలెన్స్ నుంచి గరిష్ఠంగా రూ.2,000 వరకు చెల్లింపులు చేసేందుకు అవకాశం కల్పించనున్నారు. ఇంటర్నెట్ కనెక్టివిటీ అందుబాటులో ఉండని విమాన క్యాబిన్లు, భూగర్భ రైలు నెట్‌వర్క్ వంటి వాటిని దృష్టి లో ఉంచుకుని ఈ ఫీచర్‌ను రూపొందిస్తున్నట్టు సమాచారం. ఈ విధానానికి సంబంధించి ప్రముఖ టెర్మినల్ మాన్యుఫ్యాక్చరర్లు తయారు చేసిన పీఓఎస్ డివైజ్‌లను సర్టిఫై చేసే ప్రక్రియను ఈ ఏడాదిలోనే ఎన్‌పీసీఐ ప్రారంభించనున్నట్టు తెలుస్తోంది. ఇంటర్నెట్ ఉన్నప్పుడు కస్టమర్లు తమ ఫోన్‌లోని యూపీఐ లైట్ వ్యాలెట్‌లో సొమ్మును లోడ్ చేసుకోవాలి. ఆ సొమ్మును ఆఫ్‌లైన్ టెర్మినల్ వద్ద యూపీఐ పిన్‌ను ఎంటర్ చేయకుండానే చెల్లింపులు చేసేయవచ్చు. ఈ లావాదేవీని టెర్మినల్ స్టోర్ చేసుకుంటుంది. ఎప్పుడైతే ఇంటర్నెట్‌కు కనెక్ట్ అవుతుందో అప్పుడు దాన్ని వెరిఫికేషన్ కోసం పంపుతుంది. ఆఫ్‌లైన్‌లో యూపీఐని అనుమతించేందుకు పీఓఎస్ కంపెనీలు ఎన్‌పీసీఐ నుంచి సర్టిఫికేషన్‌ను పొందాల్సి ఉంటుంది. బ్యాంకులు, థర్డ్ పార్టీ యూపీఐ అప్లికేషన్ ప్రొవైడర్లు తమ యాప్‌లలో ఈ సదుపాయాన్ని కల్పించే పనిలో ఉన్నట్టు తెలుస్తోంది.

# విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాల్సిందే

## నీట్ పరీక్ష లీకేజ్‌పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ధర్నా

**ఢిల్లీ:** భారత ప్రధాని నరేంద్ర మోదీ నివాసం దగ్గర కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ధర్నా చేపట్టారు. సోమవారం జంతర్‌మంతర్ వద్ద నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌కు నిరసనగా చేపట్టిన ఈ ధర్నాలో రాహుల్‌తో పాటు ఖర్గే, కేసీ, ప్రియాంక, పలువురు కాంగ్రెస్ ఎంపీలు పాల్గొన్నారు. కాంగ్రెస్ నేతలు చేతులకు సంకెళ్లు వేసుకుని నిరసన తెలిపారు.గూండాగిరి, నిరంకుశత్వం వద్దంటూ.. అణచివేత చర్యలు నడవవంటూ నిరసనకారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రధాని మోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతలను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రజాస్వామ్యయుతంగా ఆందోళన చేస్తుంటే పోలీసులు దౌర్జన్యం చేస్తున్నారంటూ కాంగ్రెస్ ఎంపీలు ఆగ్రహం వ్యక్తం చేశారు.ధర్నా సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. సోమవారం యువతపై లాఠీచార్జ్‌కు బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ లీకేజీపై పార్లమెంట్‌లో చర్చకు అంగీకరించలేదని అన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వంలో జవాబుదారీతనం లేదని పేర్కొన్నారు. ప్రధాని మోదీ మౌనం వీడాలని, నీట్ అంశంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోడీ నివాసం వద్ద ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో పాటు ఐదు డిమాండ్లతో ప్రధాని ఇంటి ముందు బైఠాయించిన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేంద్ర మంత్రి వచ్చి మాట్లాడినా తమ డిమాండ్ల కోసం పట్టుబట్టిన ఆయనను బలవంతంగా మోడీ ఇంటి ముందు నుంచి లాక్కెళ్లారు పోలీసులు. కాంగ్రెస్ నిరసన ప్రదర్శనకు సంఘీభావం తెలిపిన సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేష్ యాదవ్‌ను సైతం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. **రాహుల్, ప్రియాంక విడుదల :** విద్యార్థులపై లాఠీఛార్జ్‌కి నిరసనగా ప్రధాని నివాసం ముందు బైఠాయించి అరెస్టైన కాంగ్రెస్ ఎంపీ, విపక్ష నేత రాహుల్ గాంధీ విడుదలయ్యారు. లోక్ కల్యాణ్ మార్గ్‌లోని నరేంద్ర మోడీ నివాసం బయట ధర్నాకు దిగిన రాహుల్‌ను ఛత్రసాల్ స్టేడియం తరలించిన పోలీసులు.. కొన్ని గంటల తర్వాత పంపించేశారు.ప్రధాని నివాసం ముందు మెరుపు ధర్నాకు దిగిన కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి పలు పోలీస్ స్టేషన్లకు తరలించారు. విపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్‌ను ఛత్రసాల్ స్టేడియం తీసుకెళ్లారు. అలానే.. ధర్నా సందర్భంగా అరెస్టైన ఎంపీ ప్రియాంక గాంధీని మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.దాంతో, కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ స్టేషన్‌కు వెళ్లి ప్రి యాంకను కలిశారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్ తదితరులను పోలీసులు అరెస్ట్ చేసి ప్రధాని నివాసం ముందు నుంచి బస్సుల్లో పోలీస్ స్టేషన్లకు తరలించారు. దాదాపు నాలుగైదు గంటల తర్వాత వీరిని విడిచిపెట్టారు.



భారత ప్రధాని నరేంద్ర మోదీ నివాసం దగ్గర కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ధర్నా చేపట్టారు. సోమవారం జంతర్‌మంతర్ వద్ద నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌కు నిరసనగా చేపట్టిన ఈ ధర్నాలో రాహుల్‌తో పాటు ఖర్గే, కేసీ, ప్రియాంక, పలువురు కాంగ్రెస్ ఎంపీలు పాల్గొన్నారు. కాంగ్రెస్ నేతలు చేతులకు సంకెళ్లు వేసుకుని నిరసన తెలిపారు. గూండాగిరి, నిరంకుశత్వం వద్దంటూ.. అణచివేత చర్యలు నడవవంటూ నిరసనకారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రధాని మోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతలను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

మంగళవారం మధ్యాహ్నం తొలుత కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఇంటిముందుకు చేరుకొన్న రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ తదితరులు అక్కడి నుంచి లోక్ కళ్యాణ్ మార్గ్‌లోని ప్రధాని ఇంటి ముట్టడికి బయల్దేరారు. సాయంత్రం మోదీ ఇంటి ముందు ధర్నాకు దిగారు. ఈ క్రమంలో కేంద్రమంత్రి జితేంద్రసింగ్.. రాహుల్‌తో చర్చలు జరిపారు. ఆ తర్వాత సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేశ్‌యాదవ్ కూడా ఈ ధర్నాలో పాల్గొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాలు చేయాలని నినదించారు. ఈ క్రమంలో రాహుల్, ప్రియాంక, అఖిలేశ్‌తో పాటు కాంగ్రెస్ నాయకులను అదుపులోకి తీసుకొన్న పోలీసులు బస్సులో అక్కడి నుంచి తరలించారు.



### 5 డిమాండ్స్ ఇవే..

విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి
నీట్ పేపర్ లీక్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా సమాధానం చెప్పాలి
నీట్ పేపర్ లీక్‌తో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు రూ.1 కోటి నష్ట పరిహారం అందించాలి
'ఛలో పార్లమెంట్' సందర్భంగా ఢిల్లీలో విద్యార్థులపై లాఠీచార్జి, హింసపై దర్యాప్తు చేయాలి
విద్యార్థుల సమస్యలపై పార్లమెంట్‌లో చర్చించాలి

# పిల్లలను రెచ్చగొట్టవద్దు

### వారికి సరైన మార్గాన్ని చూపండి

### నీట్ లీకేజీ రగడపై ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ:** నీట్ యూజీ పేపర్ లీకేజీ అంశం ఇటీవల దేశవ్యాప్తంగా సంచలనం రేపిన విషయం తెలిసిందే. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ కార్యకర్తలు భారీ ధర్నా చేపట్టారు. సోమవారం జరిగిన పార్లమెంట్ మార్చ్ కూడా ఉద్రిక్తం అయ్యింది. ఈ నేపథ్యం లో ప్రధాని మోదీ ఆ అంశంపై స్పందించారు. పేపర్ లీకేజీలకు పాల్పడిన వారికి కఠిన శిక్షలను అమలు చేయాలన్నారు. పేపర్ లీకేజీ ఘటనలు జరగకుండా చూసుకోవడం దేశ బాధ్యతగా భావించాలని ప్రధాని అన్నారు. మంగళవారం ఎన్డీఏ ఎంపీలతో జీఎంసీ బాలయోగి ఆడిటోరియంలో జరిగిన మంగల్ మిలన్ భేటీలో ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్లు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. దోష రహిత పరీక్షా వ్యవస్థను నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రధాని మోదీ కోరినట్లు మంత్రి రిజిజు వెల్లడించారు.నీట్ రీఎగ్జామ్‌కు అధిక ప్రాధాన్యత ఇచ్చామని, పిల్లల భవిష్యత్తు దెబ్బతినకుండా ఉండేందుకు ఫలితాలను కూడా జాప్యం లేకుండా రిలీజ్ చేసినట్లు మోదీ పేర్కొన్నట్లు మంత్రి రిజిజు వెల్లడించారు. నీట్ పేపర్ లీకేజీ అంశంలో ప్రభుత్వం తక్షణమే స్పందించిందని, ఈ కేసులో 13 మందిని అరెస్టు చేసినట్లు మంత్రి తెలిపారు. భవిష్యత్తులో నీట్ పేపర్ లీకేజీ కాకుండా కఠిన చర్యలు చేపట్టామని, దీనిలో భాగమైన వారిఇ అరెస్టు చేసి జైలుకు తీసుకెళ్లినట్లు చెప్పారు. యువత భవిష్యత్తుతో ఆడుకునేవారికి కఠిన శిక్ష అమలు చేయనున్నట్లు ప్రధాని చెప్పారు. సభా వ్యవహారాలు సజావుగా సాగేందుకు ఎన్డీఏ భాగస్వామ్యులు ఐక్యంగా ఉండాలని ప్రధాని చెప్పినట్లు తెలిసింది. రాజకీయ భిన్నాభిప్రాయాలు ఉన్నా.. దేశ భవిష్యత్తు, యువత సంక్షేమ కోసం ఎంపీలు అందరూ కలిసి పనిచేయాలని మోదీ అన్నారు. చిన్న పిల్లలను రెచ్చగొట్ట వద్దు అన్నారు. వారికి సరైన దారిని చూపించాలని ప్రధాని అన్నారు. చెడు మార్గంలో



వెళ్లడం సులువుగా ఉంటుందని, కానీ మళ్లీ మంచి మార్గాన్ని అనుసరించడం ఆలస్యం అవుతోందన్నారు. విద్యార్థులను మంచి మార్గంలో నడిపించే బాధ్యత మనమీదే ఉందని, అది మన బాధ్యత అని ప్రధాని మోదీ అన్నారు. యువతను తప్పుదారి పట్టించారని, వారిని రెచ్చగొట్ట వద్దు అని, వారికి సరైన మార్గాన్ని చూపించాలన్నారు. యువతకు గైడెన్స్ ఎలా ఇవ్వాలన్న అంశాన్ని ప్రధాని మోదీ ప్రస్తావించారని మంత్రి చిరాగ్ పాశ్వాన్ తెలిపారు.

గ్లోబల్ ఎడ్యుకేషన్ మోడల్స్ ...
మనమెక్కడ ఉన్నాం? 8

## నేను కేసీఆర్‌లా మంచోడిని కాదు

### బీఆర్ఎస్ కార్యకర్తలను వేధిస్తే వదిలిపెట్టం

### మంచిర్యాల ఎమ్మెల్యేకు కేటీఆర్ వార్నింగ్



7

### ఎల్‌నినో ప్రభావంతో

# తగ్గనున్న వర్షపాతం

### సహాయ చర్యల కోసం ప్రత్యేక అధికారి నియామకం

### కేంద్రానికి నివేదిక పంపి సహాయం కోరుతాం

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**వాస్తవం: హనుమకొండ, జూలై 21:** ఎల్‌నీనో ప్రభావం కారణంగా ఈ ఏడాది సాధారణం కంటే వర్షపాతం గణనీయంగా తగ్గే అవకాశం ఉందని, తెలంగాణతో సహా దేశంలోని అనేక రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి ఉన్నప్పటికీ, దక్షిణాది రాష్ట్రాలు, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో వర్షాభావ ప్రభావం మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఎల్‌నీనో ప్రభావం నేపథ్యంలో చేపట్టాల్సిన ముందస్తు కార్యాచరణ, కంటింజెన్సీ ప్రణాళికలు, వివిధ శాఖల సంసిద్ధతపై మంగళవారం హనుమకొండ ఐడీఓసీ కలెక్టరేట్‌లో అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మూడు రోజుల క్రితం సీఎం అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో వర్షాభావ పరిస్థితులపై సమగ్రంగా చర్చించామన్నారు. వర్షాభావ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ప్రతి ఉమ్మడి జిల్లాకు ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని ప్రత్యేక అధికారిగా రాష్ట్ర ప్రభుత్వం నియమించిందని తెలిపారు. ఆయా జిల్లాల్లో వ్యవసాయం, తాగునీటి లభ్యత, భూగర్భ జలాలు, వర్షాభావ పరిస్థితులు తదితర అంశాలపై ఈ ప్రత్యేక అధికారులు నివేదికలు సిద్ధం చేసి ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రివర్గానికి అందజేస్తారని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల నుంచి జిల్లాలను ఎలా గట్టెక్కించాలి, రైతులకు ఎలాంటి భరోసా కల్పించాలి, తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఎలాంటి చర్యలు చేపట్టాలనే దానిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని మంత్రి తెలిపారు. ఈ వర్షాభావ పరిస్థితులపై సమగ్ర నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించి, రాష్ట్రానికి అందాల్సిన సహాయం, కేంద్రం నుంచి పొందాల్సిన మద్దతుపై చర్యలు తీసుకుంటామని తెలి పారు.

# డ్రగ్స్,సైబర్ నేరాలు,రోడ్డు ప్రమాదాల నివారణలో విద్యార్థుల పాత్ర కీలకం

**చదువుతో పాటు క్రమశిక్షణ,**

**సామాజిక బాధ్యత కూడా అలవర్చుకోవాలి**

**సిరిసిల్ల డీఎస్పీ కె నాగేంద్రచారి**

**వాస్తవం : ఎల్లారెడ్డిపేట**

డ్రగ్స్, గంజాయి వంటి మాధకద్రవ్యాలు, సైబర్ నేరాలు,రోడ్డు ప్రమాదాల నివారణలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని సిరిసిల్ల డిఎస్పీ నాగేంద్రచారి విద్యార్థులకు సూచించారు.ఎలా ్లరెడ్డిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని రాచర్ల జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు డ్రగ్స్ వలన కలుగు దుష్ప్రభావాలు, సైబర్ నేరాలు,రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని సిరిసిల్ల డీఎస్పీ కె నాగేంద్రచారి నిర్వహించారు.ఈసందర్భంగా డీఎస్పీ కె నాగేంద్ర చారి మాట్లాడుతూ..యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి తమ లక్ష్యాల సాధనపై దృష్టి సారించాలని సూచించారు.డ్రగ్స్,గంజాయి వంటి మత్తు పదార్థాలు ఆరోగ్యాన్ని,కుటుంబాలను,భవిష్యత్తును నాశనం చేస్తాయని తెలిపారు.ఎవరైనా మాదకద్రవ్యాల విక్రయం లేదా వినియోగం గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని,అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, లింకులు,నకిలీ వెబ్‌సైట్లను నమ్మవద్దని సూచించారు.ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డు ఎవరికీ వెల్లడించవద్దని తెలిపారు.సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయడంతో పాటు సమీప పోలీస్ స్టేషన్‌లో లేదా సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని విద్యార్థులకు వివరించారు.రోడ్డు ప్రమాదాల నివారణలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని,ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగాపాటించడం,హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ వినియోగించడం, మైనర్లు వాహనాలు నడపకుండా ఉండడం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయకుండా ఇతరులకు కూడా అవగాహన కల్పించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.చదువుతో పాటు క్రమశిక్షణ, సామాజిక బాధ్యతను కూడా విద్యార్థులు అలవర్చుకోవాలని సూచించారు. మంచి అలవాట్లు, నైతిక విలువలు, చట్టాల పట్ల గౌరవం మరియు సమాజం





పట్ల బాధ్యతతో వ్యవహరించడం ద్వారా విద్యార్థులు తమ భవిష్యత్తును విజయవంతంగా తీర్చిదిద్దుకోవడంతో పాటు సమాజ అభివృద్ధికి కూడా తోడ్పడగలరని తెలిపారు.ఈకార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట సర్కిల్ సిఐ ఓ వెంకటేష్, ఎస్ఐ రాహుల్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# సహకార సంఘాలను రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చొద్దు

**రైతుల స్వయం ప్రతిపత్తిని కాపాడాలి: హింగే భాస్కర్**

**రైతులే పాలకవర్గాలను ఎన్నుకునేలా ఎన్నికలు నిర్వహించాలి**

**నామినేటెడ్ పదవులతో రాజకీయ జోక్యాన్ని ఆపాలని డిమాండ్**

**వాస్తవం : ఎల్కతుర్తి**

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల నిర్వహణలో రైతుల ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ రాజకీయ జోక్యాన్ని పెంచడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి కరీంనగర్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్ అన్నారు. ఎల్కతుర్తిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.రైతుల ఆర్థికాభివృద్ధి,పంట రుణాలు,ఎరువులు,విత్తనాల పంపిణీ,ధాన్యం కొనుగోలు వంటి కీలక సేవలను అందించే సహకార సంఘాలు రైతుల సొంత సంస్థలని, అలాంటి సంస్థలను రాజకీయ నాయకుల పునరావాస కేంద్రాలుగా మార్చడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు.సహకార సంఘాల పాలకవర్గాలను రైతులే స్వేచ్ఛగా ఎన్నుకునే అవకాశం కల్పించాల్సిన ప్రభుత్వం, నామినేటెడ్ పదవుల ద్వారా రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చాలని చూడడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు. రైతుల సంక్షేమాన్ని పక్కనబెట్టి రాజకీయ నిరుద్యోగులకు పదవులు కట్టబెట్టే ధోరణిని వెంటనే విరమించుకోవా



లని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సహకార సంఘాలు రాజకీయాల కోసం కాకుండా రైతుల ప్రయోజనాల కోసం పని చేయాలని, వాటి స్వయం ప్రతిపత్తిని కాపాడాలని కోరారు. రైతుల అభిప్రాయాలను గౌరవిస్తూ పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించి, సహకార సంఘాల పాలన రైతుల చేతుల్లోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రైతుల హక్కులకు భంగం కలిగించే ఏ నిర్ణయాన్నైనా తెలంగాణ రైతు రక్షణ సమితి తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా రైతులతో కలిసి ఉద్యమాలు చేపట్టేందుకు కూడా వెనుకాడబోమని హింగే భాస్కర్ హెచ్చరించారు.ఈ సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు,నాయకులు కొదరే మాధవరావు, సుధాకర్ రావు, శ్రీనివాస్, కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫ్లెక్సీలను తొలగించి చెట్లు నాటండి

**వాస్తవం : మోత్కూర్**



మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని ప్రధాన రహదారి వెంట ఉన్న డివైడర్లలో మున్సిపాలిటీ అధికారులు ఫ్లెక్సీలు తొలగించి చెట్లు నాటాలని బిజెపి యాదాద్రి భువనగిరి జిల్లా మాజీ అధికార ప్రతినిధి గౌరు. శ్రీనివాస్ మున్సిపాలిటీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు నేటికీ తొలగించక పోవడంతో అంబేద్కర్ చౌరస్తా వద్ద వాహనాల రాకపోకలు సరిగా కనిపించడం లేదని తెలిపారు. ఫ్లెక్సీలతో వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.డివైడర్లలో చెట్లు నాటి పచ్చదనం పరిశుభ్రతకు కేంద్రంగా మోత్కూరు మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దాలని కోరారు. వర్షాకాలం వచ్చినా నేటికీ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు డివైడర్లలో చెట్లు నాటాలనే ఆలోచన కలగకపోవడం శోచనీయమని అన్నారు. డివైడర్లలో చెట్లు నాటితే కళ్ళకు కనువిందు కలుగుతుందని, కాలుష్యం కొంత మేరకైనా తగ్గుతుందనీ, ఇది ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి

**నర్సాయిపల్లి, గాగిళ్లపూర్ గ్రామాలలో ప్రత్యేక గ్రామసభలు**

**ఆరుతడి పంటల సాగు,నీటి సంరక్షణపై రైతులకు అవగాహన**


**వాస్తవం : మద్దూరు**

ఎల్ నినో కారణంగా తలెత్తే పరిస్థితులు,ప్రభావితమయ్యే అంశాలపై ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ మేరకు మండల పరిధిలోని నర్సాయిపల్లి,గాగిళ్ల పూర్ గ్రామాలలో స్థానిక సర్పంచులు శనిగరం సత్యనారాయణ, ఇట్టబోయిన కనుక చంద్రం అధ్యక్షతన మంగళవారం ప్రత్యేక గ్రామసభలు నిర్వహించా రు.ఈ సందర్భంగా అధికారులు ఎంపీడీవో రామ్మోహన్,ఏఓ రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో నీటి వినియోగం ఎక్కువగా ఉండే పంటలకు బదులుగా,తక్కువ నీటితో పండే ఆరుతడి పంటల వైపు రైతులు మొగ్గు చూపాలని సూచించారు.భూగర్భ జలాల పెంపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అధికారులు కోరారు. అందుకోసం గ్రామాలలో చేపట్టాల్సిన పలు నీటి సంరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు.?ప్రతి ఇంటికీ తప్పనిసరిగా ఇంకుడు గుంత నిర్మించుకోవాలి. గ్రామ పంచాయతీ బోర్‌వెల్స్ వద్ద రీఛార్జ్ గుంతలు ఏర్పాటు చేయాలి.రైతులు తమ పంట పొలాలలో ఫార్మ్ పాండ్స్ నిర్మించుకోవాలి.ప్రతి గ్రామానికి ఒక ఊట చెరువు నిర్మించాలి. ఇదే సమయంలో రాబోయే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు



అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హాజరైన ప్రజా ప్రతినిధులు, మండల పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, మంజుల,ఉప సర్పంచులు భరత్ రెడ్డి, గొడుగు బాలరాజు పాల్గొన్నారు.అలాగే వ్యవసాయ విస్తరణ అధికారి రాజు, టెక్నికల్ అసిస్టెంట్ రమేష్,వార్డు సభ్యులు, గ్రామస్థాయి సిబ్బంది మరియు గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

# 'అవ్వ' కథల సంపుటి ఆవిష్కరణ



**వాస్తవం : చందుర్తి**

చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన ఆర్మీ సైనికుడు,ప్రముఖ కవి,బహుభాషావేత్త,'మై గిఫ్ట్'"స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ పెరుక రాజు రచించిన "అవ్వ" కథల సంపుటిని ఆర్మీ అధికారి, సాయి కోర్ సెక్యూరిటీ అండ్ ట్రైనింగ్'అధినేత కల్నల్ కెఎస్ రావు మంగళవారం సికింద్రాబాద్‌లోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కల్నల్ కెఎస్ రావు మాట్లాడుతూ...దేశ రక్షణ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ... మరోవైపు సాహిత్య సృజనలోనూ విశేష కృషి చేయడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు.ఒకే భాషకు పరిమితం కాకుండా పలు భారతీయ భాషల్లో విలువైన సాహిత్యాన్ని అందిస్తూ, ఆర్మీ విధుల నడుమ కూడా నిరంతర సాహిత్య సేవ కొనసాగించడం డాక్టర్ పెరుక రాజు అంకితభావానికి నిదర్శనమని కొనియాడారు.ఈ సంపుటిలో వివిధ భారతీయ భాషల నుంచి 15 కథలు చోటుచేసుకున్నాయి.ఈ కార్యక్రమంలో పద్మ చిరుమామిళ్ల,సుబ్రంత్,ఆర్య,అనీశ్,తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామ చెయ్యాలి

**గుండు వెంకటనర్సు**
**సిపిఎం పార్టీ మండల కార్యదర్శి**




**వాస్తవం : మోత్కూర్**

కేంద్ర విద్యాశాఖ మంత్రి దర్మేంద్ర ప్రధాన్ తన పదవికి వెంటనే రాజీనామా చెయ్యాలని, ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల యువతపై జరిగిన లాటిచార్జీని తీవ్రంగా ఖండిస్తున్నామని,సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకట నర్సు అన్నారు.మంగళవారం రోజున మోత్కూర్ లో ఆయన పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ..ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షల్లో అవినీతి, ప్రశ్నపత్రాల్లో లీకేజీలు నియమాకాల్లో అక్రమాలకు బాధ్యతవహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి దర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చెయ్యాలని డిమాండ్ చేస్తూ, విద్యార్థి యువజన సంఘాలు నిర్వహించిన నిరసనపై ఢిల్లీ పోలీసులు లాఠిచార్జ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. జంతర్ మంతర్ నుండి పార్లమెంట్ వరకు శాంతియుతంగా ర్యాలీగా వెళ్తున్న నిరసన కారులను అడ్డుకొని బలప్రయోగానికి పాల్పడటం ప్రజాస్వామ్య హక్కులపై దాడిచేయడమేనని విమర్శించారు.దేశవ్యాప్తంగా ప్రభుత్వ పరీక్షల్లో జరుగుతున్న అవినీతి,ప్రశ్నపత్రాల లీకేజీల వల్ల లక్షలాది మంది విద్యార్థులు నిరుద్యోగ యువత తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఈ పరిస్థితులకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చెయ్యాలని, ఆత్మహత్య చేసుకున్న నీట్ అభ్యర్థులందరికి కోటి రూపాయల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యావ్యవస్థలో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు దడిపల్లి. ప్రభాకర్, కురిమేటి. యాదయ్య తదితరులు ఉన్నారు.

# హుస్నాబాద్ నుండి అరుణాచలంకు టూర్ ప్యాకేజీ


**వాస్తవం : హుస్నాబాద్**




ప్రయాణికుల సౌకర్యార్థం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ ) హుస్నాబాద్ డిపో ఆధ్వర్యంలో 2026 జూలై 27 సోమవారం,గురు పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక ఆధ్యాత్మిక టూర్ ప్యాకేజీని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ వెంకన్న తెలిపారు. ఇందుకు సంబంధించి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.ఈ ప్రత్యేక టూర్ ప్యాకేజీలో కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం, గోల్డెన్ టెంపుల్ (వెల్లూరు), అరుణాచలేశ్వర స్వామి దేవస్థానం (తిరువణ్ణామలై), జోగులాంబ అమ్మవారి దేవస్థానం (అలంపూర్) దర్శనం కల్పించబడుతుందని అన్నారు. కాగా హుస్నాబాద్ డిపో నుండి మధ్యాహ్నం గం.2 లకు ప్రారంభమవుతుందని, ఇందులో పెద్దలకు రూ.4,500,పిల్లలకు రూ.3,500 నిర్ధారించడం జరిగిందన్నారు.ఆసక్తి గల ప్రయాణికులు ముందస్తుగా తమ సీట్లను బుక్ చేసుకోవడానికి సూపర్వైజర్ శరయ్య 97048 33971,సిస్టమ్ ఇన్‌చార్జ్ శ్రీనివాస్ 97012 03028,కో-ఆర్డినేటర్ సురేష్ 99519 90992 లను ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

**గోదావరిఖనిలో నాన్ జ్యుడిషియల్ స్టాంప్ పేపర్ల**
## అక్రమ విక్రయాలపై విచారణకు కలెక్టర్ ఆదేశాలు

**వాస్తవం : గోదావరిఖని**



గోదావరిఖనిలో నాన్ జ్యుడిషియల్ స్టాంప్ పేపర్లను నిర్ణీత ఎం ఆర్ పి ధరల కంటే అధికంగా నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ ఆధ్వర్యంలో మే 7 న జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు సంస్థ అధ్యక్షుడు మద్దెల దినేష్ తెలిపారు ఈ ఫిర్యాదుపై స్పందించిన పెద్దపల్లి జిల్లా కలెక్టర్ జిల్లా రిజిస్ట్రార్ (రిజిస్ట్రేషన్ స్టాంపులు) పెద్దపల్లి కు జూన్ 29 న లేఖ ద్వారా ఆదేశాలు జారీ చేశారని ఆయన పేర్కొన్నారు ఫిర్యాదు లో పేర్కొన్న అంశాలపై సమగ్ర విచారణ నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించి అధిక ధరలకు స్టాంప్ పేపర్లు విక్రయి స్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అలాగే చేపట్టిన చర్యల వివరాలను 7 రోజుల్లోగా జిల్లా కలెక్టర్ కార్యాలయానికి నివేదించాలని ఆదేశించారని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా మద్దెల దినేష్ మాట్లాడుతూ ప్రజలను దోచుకునే విధంగా అధిక ధరలకు స్టాంప్ పేపర్లు విక్రయించడం చట్టవిరుద్ధమని ఇటువంటి అక్రమాలకు పాల్పడే వారి పై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా ప్రజలకు న్యాయం జరుగుతుందని అన్నారు. జిల్లా కలెక్టర్ తక్షణ స్పందనకు కృతజ్ఞతలు తెలిపారు అలాగే విచారణ పారదర్శకంగా నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు

జర్నలిస్ట్ సంక్షేమ సంఘం
Red 914/2015
జర్నలిస్ట్ సంక్షేమమే పరమావధిగా
జర్నలిస్ట్ హక్కుల కోసం....
వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...
సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం: 9618616110

# వేదధర్మ పరిరక్షణకు
# ప్రతి ఒక్కరు కృషి చేయాలి

**ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**వాస్తవం : వేములవాడ**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ పార్వతీ రాజరాజేశ్వర అఖిల భారత వేదశాస్త్రస్మార్తఆగమ విద్వత్ సదస్సు, వేదస్మార్త పరీక్షా మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులుఆది శ్రీనివాస్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ కి ఆలయ అర్చకులు,వేద పండితులు స్వస్తితో స్వాగతం పలికారు. అనంతరం ఆయన శ్రీ భీమేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మండపంలో స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేయగా, ఆలయ ముఖ్య కార్యాచరణ అధికారి ఎల్ రమాదేవి స్వామివారి శేషవస్త్రం, లడ్డు ప్రసాదాన్ని అందజేశారు.మంగళవారం నుండి 25 వరకునిర్వహించబడుతున్న ఈ మహోత్సవాల్లో భారతదేశంలోని వివిధ రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, చెన్నై, కేరళ తదితర ప్రాంతాల నుంచి సుమారు 170 మందికి పైగా వేద విద్యార్థులు,వేద పండితులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుని పాల్గొంటున్నారని తెలిపారు .ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ..వేదాలు మన సనాతన ధర్మానికి మూలస్తంభాలని అన్నారు.వేదాలను పరిరక్షించడం అంటే ధర్మాన్ని పరిరక్షించినట్లేనని పేర్కొన్నారు. భారతదేశంలోని ఆధ్యాత్మిక సంప్రదాయాలు, ఆగమ శాస్త్ర విధానాలు ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని, ఇతర దేశాల ప్రజలు సైతం మన సంస్కృతిని అధ్యయనం చేస్తున్నారని తెలిపారు.వేద విద్యను భావితరాలకు అందించేందుకు ఇలాంటి వేద--స్మార్త పరీక్షలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి విశేష ప్రాధాన్యత ఇస్తోందని,ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి,దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో ఆలయాల అభివృద్ధితో పాటు ఉద్యోగ నియామకాలు కూడా చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు.వేములవాడ రాజన్న ఆలయం అభివృద్ధి కోసం తాను ఎల్లప్పుడు కృషి చేస్తానని, భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తన లక్ష్యమని తెలిపారు. వేద విశ్వవిద్యాలయం ఏర్పాటు, సంస్కృత విద్యాభివృద్ధి వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని



ఇప్పటికే అసెంబ్లీలో ప్రస్తావించినట్లు వెల్లడించారు.అలాగే ఈ నెల 30, 31 తేదీల్లో, ఆగస్టు న నిర్వహించనున్న వరుణ యాగం ద్వారా సకాలంలో వర్షాలు కురవాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, రైతులు సుఖసంతోషాలతో ఉండాలని, లోక శాంతి,లోక కళ్యాణం చేకూరాలని స్వామివారిని ప్రార్థించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ ముఖ్య కార్యాచరణ అధికారి ఎల్ రమాదేవి, వేద పాఠశాల ప్రిన్సిపాల్ ఆంజనేయ శర్మ, డీఈఓ నవీన్ కుమార్, ఆలయ అర్చకులు,వేద పండితులు,వేద విద్యార్థులు,భక్తులు పాల్గొన్నారు.

# నీటి సంరక్షణ పనులు ముమ్మరంగా చేయాలి

**ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించాలి**

**ఇందిరమ్మ ఇండ్లలో స్థాయిల వారీగా పురోగతి ఉండాలి**

**రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**అధికారులతో టెలీ కాన్ఫరెన్స్**

**వాస్తవం : రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)**

రాజన్న సిరిసిల్ల జిల్లావ్యాప్తంగా నీటి సంరక్షణ పనులు ముమ్మరంగా చేయించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. తెలంగాణ జలసిరి, ఇందిరమ్మ ఇండ్ల పై హౌసింగ్ ఏఈలు, ఎంపీడీఓలు, గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులతో భూగర్భ జలాలు తగ్గుతున్నాయని తెలిపారు. భవిష్యత్తు అవసరాలు, పంటల సాగు, తాగునీరు, భూగర్భ జలాల వృద్ధి కోసం వర్షం నీటిని ఒడిసి పట్టాలని పిలుపునిచ్చారు.తెలంగాణ జలసిరి కింద జల సంరక్షణ కోసం చేపట్టనున్న పనులు,లాభాలపై టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లకుఅవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఇంకుడు గుంతలు, పంట కుంటలు, ఊట కుంట, బోరు బావుల రీచార్జ్ పనులు జిల్లాలోని మున్సిపాలిటీలు, అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో చేపట్టి.. పూర్తి చేయాలని ఆదేశించారు.ఫాం పాండ్స్ తో రైతుల పొలాల్లో భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయని, ఎన్నో లాభాలు ఉన్నాయని తెలియజేస్తూ అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో ఫాం పాండ్స్, బోర్ వెల్స్ రీచార్జ్ పనులు చేసుకునేలా చూడాలని సూచించారు.జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల పరిధిలో ప్రభుత్వ, ప్రజల బోర్ వెల్స్ రీచార్జ్ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. బోర్ వెల్స్ రీచార్జ్ తో భూగర్భ జలాలు పెరిగి నీటి ఇబ్బందులు దూరమవుతాయనే విషయాన్ని తెలియజేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.అలాగే నీటి వృథాను అరికట్టాలని పేర్కొన్నారు.క్షేత్ర స్థాయిలో సమగ్ర ప్రణాళిక రూపొందించుకుని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.జిల్లాలో మొదటి దశలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల ప్రస్తుత పరిస్థితి, ఇప్పటివరకు ప్రారంభమైన నిర్మాణాలు, వివిధ దశల్లో ఉన్న ఇండ్లు, పూర్తయిన ఇండ్ల వివరాలను మండలాల వారీగా అధికారులను అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు.రెండో దశలో మంజూరు చేయాల్సిన ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి చేపడుతున్న ప్రక్రియ, లబ్ధిదారుల ఎంపిక, అర్హత కలిగిన లబ్ధిదారుల వివరాలను ఆరా తీశారు.మొదటి దశలో మంజూరైన ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఇండ్ల నిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం,నిర్మాణ సామగ్రి తదితర అంశాలపై అవగాహన కల్పి



స్తూ,వారికి అవసరమైన సహకారం అందించాలని సూచించారు.ప్రతి మండలంలో ఇండ్ల నిర్మాణాల పురోగతిని క్షేత్ర స్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. స్పష్టమైన కార్యాచరణ, ప్రణాళిక రూపొందించుకుని ముందుకు వెళ్లాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లు వేగంగా పూర్తి చేసుకుంటే కలిగే లాభాలపై లబ్ధిదారులకు వివరించాలని తెలిపారు.గుడిసెలు,రేకుల షెడ్లలో ఉంటున్న వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసే ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.ఈ టెలీ కాన్ఫరెన్స్ లో హౌసింగ్ పీడీ వెంకట మాధవరావు, డీఆర్ డీఓ లక్ష్మీనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

# చీర్లవంచలో డ్రై డే

**పరిశీలించిన జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి ఎంజెలా అల్ఫ్రేడ్**

**వాస్తవం : వేములవాడ**

వేములవాడ ఆర్ఆర్ కాలనీ చీర్లవంచ లో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారండ్రై డే కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలనుజిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ జి ఏంజెలా అల్ఫ్రెడ్ పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామంలోని నివాస ప్రాంతాలు, నీరు నిల్వ ఉండే ప్రదేశాలు, ఇంటింటి పరిసరాలను తనిఖీ చేసి,దోమల నివారణ చర్యలను క్షేత్రస్థాయిలో సమీక్షించారు.డెంగ్యూ, మలేరియా,చికున్‌గున్యా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించేందుకు ప్రతి మంగళవారం, శుక్రవారం తప్పనిసరిగా డ్రై డే నిర్వహించాలని క్షేత్ర స్థాయి సిబ్బందికి సూచించారు.ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, నీటి నిల్వ పాత్రలను వారానికి ఒకసారి పూర్తిగా ఖాళీ చేసి శుభ్రం చేయాలని, కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, కూలర్లు, పూల కుండీలు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. జ్వరం, తలనొప్పి, ఒళు



_నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ, దోమల లార్వా నిర్మూలన కొరకు నీరు నిల్వ వుండే ప్రదేశాల్లో ఆయిల్ బాల్ ను వినియోగించాలని దోమల నివారణకు పాసింగ్ చర్యలను మరింత సమర్థవంతంగా చేపట్టాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. గ్రామ ప్రజలు కూడా ఆరోగ్య శాఖతో కలిసి డ్రై డే కార్యక్రమాలను విజయవంతం చేయాలని జిల్లా వైద్యాధికారి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం అధికారులు,ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు,పాల్గొన్నారు.

## పంటల పైన రైతులకు అవగాహన

**వ్యవసాయ అధికారి రాజు**



**వాస్తవం : మద్నూర్**

కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం పెద్ద శక్కర్గ గ్రామంలో మంగళవారం రోజున వానకాలంలో సాగు చేస్తున్న పంటలలో ఎరువు,పురుగు మందుల యాజమాన్య పద్ధతులపైమండల వ్యవసాయ అధికారి రాజు రైతులకు అవగాహన కల్పించడం జరిగింది.గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి కలుపు మందు, ఎరువులు, పురుగు మందు వర్షం తగ్గిన తర్వాత భూమిలో తేమ ఉన్నప్పుడే పిచికారి చేసుకోవాలని సూచించడం జరిగింది.అలాగే వరి వేసుకునే రైతులు ఈ సారి ఆశించిన మేరకు వర్షాలు లేనందున వరికి బదులు ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని సూచించడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్ విశాలాక్షి, హనుమాన్ మందిరం చైర్మన్ రామ్ పటేల్,ఏఈవో సరోజ, సెక్రెటరీ లక్ష్మణ్,గ్రామ రైతులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ డివిజన్‌గా తీర్చిదిద్దుదాం

**కార్పొరేటర్ నెలకంటి రాము**

**వాస్తవం : గోదావరిఖని**

ఈరోజు 38వ డివిజన్ హనుమాన్ నగర్ అంబేద్కర్ నగర్ లలో కార్పొరేటర్ నెలకంటి రాము పర్యటించి మున్సిపల్ సానిటేషన్ ఇన్స్పెక్టర్ మున్సిపల్ శానిటేషన్ సిబ్బందితో డ్రైనేజీలను శుభ్రం చేపిస్తూ రోడ్డుపై చెత్త వేయడం మానుకొని చెత్త బండిలోనే చెత్త వెయ్యాలని సూచించారు చెత్త రోడ్డుపై వేయకుండా మన డివిజన్ ని స్వచ్ఛ డివిజన్ గా మార్చుకొని స్వచ్ఛ రామగుండం గా తీర్చిదిద్దడం లో భాగంగా డివిజన్ ప్రజలందరికీ కార్పొరేటర్ నెలకంటి రాము అవగాహనకల్పించారు ప్రజలందరిలో చైతన్యం రావాలని సూచించారు రోడ్లపై చెత్త వేస్తే కార్పొరేషన్ అధికారులు జరిమానా విధిస్తారన్నారు అదేవిధంగా ఈ వర్షాకాల ప్రభావంతో డివిజన్లో ఎక్కడైతే సమస్యలు ఉన్నాయో డివిజన్‌లోని గల్లి గల్లి తిరుగుతూ ఎ



మ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ సహకారంతో డివిజన్ లో సమస్యలు తలెత్తకుండా చెత్త డ్రైనేజీ కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ డివిజన్ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చేస్తున్నామన్నారు ఈ కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్ సాయి కృష్ణ, సానిటేషన్ సూపర్వైజర్ యూసఫ్ తీట్ల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు

## పలు డివిజన్‌లలో తేలికపాటి వర్షం




**వాస్తవం : జూబ్లీహిల్స్**

సాధారణంగా వాతావరణ శాఖ లెక్కల ప్రకారం ఒక గంటలో 2.5 మి. మి. కంటే వర్షపాతం నమోదు అయితే దానిని తేలికపాటి వర్షంగా పరిగణిస్తారు.ఇది పెద్దగా గాలి ఉరుములు,మెరుపులు లేకుండా జల్లులు లేక చిన్న నీటి బిందువులుగా కురుస్తుంది. అటువంటి తేలికపాటి వర్షం మంగళవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం లోని పలు డివిజన్ లలో కురిసింది. వాతావరణం చల్లబడి తేలికపాటి వర్షం కురిసేసరికే జూబ్లీహిల్స్ నియోజకవర్గం లోని ప్రజలు సంతోషంలో మునిగిపోయారు.

# పోక్సో కేసులో నిందుతునికి జైలు శిక్ష, జరిమానా

**కృషి చేసిన అధికారులను,పిపి,సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ**

**వాస్తవం : సిరిసిల్ల**



మైనర్ బాలిక పై లైంగిక వేధింపుల(పోక్సో) కేసులో నిందితుడుకి 10 సంవత్సరాలు జైలు శిక్ష, 2 వేల జరిమానా విధిస్తు సిరిసిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి రాధిక జైస్వాల్ మంగళవారం తీర్పు వెల్లడించినట్టు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు.కేసు వివరాలు.సిరిసిల్లలోని బివై నగర్కి చెంది న వేముల శ్రీనివాస్ అనే వ్యక్తి మైనర్ బాలిక ను లైంగిక వేధింపులకి గురి చేసిన విషయంలో చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 కి ఫోన్ ద్వారా సమాచారం అందించగా, జిల్లా బాల ల పరిరక్షణ విభాగం వారి పిర్యాదు మేరకు సిరిసిల్ల పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి అప్పటి సిరిసిల్ల టౌన్ ఎస్ఐ శ్రీకాంత్ దర్యాప్తు అనంతరం నిందితుడిని రిమాండ్కి తరలిం చి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు.కోర్టు విచారణలో భా గంగా జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్య పర్యవేక్షణలో కోర్టు మానిటరింగ్ ఎస్ఐ రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ జనార్ధన్, కోర్టు మానిటరింగ్ కానిస్టేబుల్ నవీన్, పోక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెల కోర్టులో 8 మంది సాక్షుల ను ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ రజినీకాంత్ వాదించగా,శాస్త్రీయ ఆధారాలుసాక్ష్యాలు పరిశీలి శీచిన న్యాయమూర్తి నేరము రుజువు కావడంతో నిందితుడైన వేముల శ్రీనివాస్ కి 10 సంవత్సరాలు జైలు శిక్ష, జరిమాన విధించారు.సమాజంలో నేరం చెసిన వారు ఎవరు కుడా శిక్ష ల నుండి తప్పించుకోలేరని, శిక్షలతోనే సమాజంలో మార్పు వస్తుందని,పోలీసులు, ప్రాసిక్యూషన్ వారు వ్యూహాత్మకంగా న్యాయ నిరూపణ,న్యాయ విచారణ జరిపి శిక్షలు పడేల చేస్తా రని జిల్లా ఎస్పీ సూచించారు.ఈకేసులో పకడ్బందీగా దర్యాప్తు జరిపి నిందితుడికి శిక్ష పడేలా కృషి చెసిన అప్పటి విచారణ అధికారి శ్రీకాంత్,ప్రస్తుత సిఐ శ్రీనివాస్,పబ్లిక్ ప్రాసిక్యూటర్ రజినీకాంత్,కోర్టు మానిటరింగ్ ఎస్ఐ రవీందర్ నాయుడు, కోర్టు కానిస్టేబుల్ జనార్ధన్,కోర్టు మానిటరింగ్ కానిస్టేబుల్ నవీన్,పోక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెల లను జిల్లా ఎస్పీ అభి నందించారు.మైనర్లపై నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని,ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలాపోలీస్ యంత్రాంగం కట్టుబడి ఉందన్నారు.

# బహుజనల హక్కుల సాధనే ధ్యేయం

**భీమ్ ఆర్మీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు**

**భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షులు దొబ్బల ప్రవీణ్ కుమార్**

**వాస్తవం : సిరిసిల్ల**



బహుజనుల హక్కుల సాధనే భీమ్ ఆర్మీ ధ్యేయమని జిల్లా అధ్యక్షులు దొబ్బల ప్రవీణ్ కుమార్ వెల్లడించారు. సిరిసిల్ల పట్టణంలో మంగళవారం భీమ్ ఆర్మీ11వ ఆవిర్భావ దినోత్స వ వేడుకలను ఘనంగా నిర్వహించారు.భీమ్ ఆర్మీ జెండాను ఆవిష్కరించారు. మహనీయులకు పూలదండలు వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగాదొబ్బల ప్రవీణ్ కుమార్ మాట్లా డుతూ.... భీమ్ ఆర్మీ స్థాపన నుంచి సామాజిక న్యాయం, రా జ్యాంగ పరిరక్షణ,బహుజన హక్కుల సాధన,విద్యార్థులు, యు వత అభ్యున్నతి కోసం నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. దేశంలో రాజ్యాంగ విలువలను కాపాడుతూ, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాల సాధనే భీమ్ ఆర్మీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.విద్యార్థులు కేవలం ఉద్యోగాల కోసమే కాకుండా రాజ్యాంగం, సామాజిక బాధ్యతలు, మానవ హక్కు లపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు .ప్ర స్తుత దేశ, రాష్ట్ర పరిస్థితుల్లో యువత రాజ్యాంగ స్ఫూర్తితో ముందుకు వచ్చి సామాజిక మార్పుకు కృషి చేయాలని పిలు పునిచ్చారు.అన్యాయం,వివక్ష,అణచివేతకు వ్యతిరేకంగా చట్టబ ద్ధంగా,ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడాలని అన్నారు.భీమ్ ఆర్మీ మరింత బలోపేతం కావడానికి యువత, విద్యార్థులు, మహి ళలు,మేధావులు పెద్ద ఎత్తున సంస్థలో చేరి బహుజన సమాజ అభ్యున్నతికి తమ వంతు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో భీమ్ ఆర్మీ నాయకులు,హరీష్,కిరణ్, మహేష్, వేణు,రాకేష్,నరేష్,సృజన,కావ్య,తదితరులు,కార్యకర్తలు, విద్యా ర్థులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియలో వేగం పెంచాలి

**రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి**

**వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష**

**హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**వాస్తవం : రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)**



ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) డిజిటలైజేషన్ప్రక్రియ లో వేగం పెంచాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శ న్ రెడ్డి అధికారులను ఆదేశించారు.ఎస్ఐఆర్ ప్రక్రియపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మంగళవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష స మావేశం నిర్వహించగా,రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్,అదనపు కలెక్టర్ గడ్డం నగేష్తో కలిసి హాజరయ్యా రు.ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రగతి వివరాలు సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మాట్లాడు తూ ...రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియలో వెనుకబడి ఉన్న జిల్లాలలో ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు వారంలోగా అన్ని జిల్లాల ఎస్ఐఆర్ ప్రక్రియ 90 శాతానికి చేరుకోవాలని, వీలైనంత త్వరగా ప్రక్రియ మొత్తాన్ని పూర్తి చేయాలని సూచించారు. ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారములో ఆధార్ నంబరు నమోదు చేయడం కేవలం ఐచ్ఛిక మాత్రమే అని, తప్పనిసరి కాదని వివరించారు. కలెక్టర్లంతా ప్రక్రియ పూర్తయ్యే వరకు పర్యవేక్షణ ఉంచాలని ఆదేశించారు. రాజన్న సిరిసిల్లజిల్లాలో ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియ 80 శాతం పూర్తి అయిందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఈ ఆర్ఓలు,ఏఈఆర్ఓలు తమ పరిధిలో పర్యవేక్షణ చేయా లని,రాజకీయ పార్టీలతో క్రమం తప్పకుండా మీటింగులు పెట్టాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రి య నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదే శించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు శ్రీధర్ బాబు,కెవన్ బి కుమారి, తహసీల్దార్లు మహే ష్, జయంత్, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్, సిరిసిల్ల ము న్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, ఎన్నికల విభాగం అధికా రులు, తదితరులు పాల్గొన్నారు.

# చెరువుల సుందరీకరణకు కృషి

**ఆక్రమణలకు పాల్పడితే క్రిమినల్ కేసులు..**

**పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి**



**వాస్తవం : పటాన్ చెరు**

అమీన్ పూర్, పటాన్ చెరు సర్కిళ్ల పరిధిలోని చెరువుల అభి వృద్ధి,సుందరీకరణకు కృషి చేస్తున్నామని పటాన్చెరు శాసనస భ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. చెరువుల బఫర్ జోన్లు, ఎఫ్టిఎల్ పరిధిలోని స్థలాల ఆక్రమణకు ప్రయత్నిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సూచించారు. మంగళ వారం సాయంత్రం నీటిపారుదల శాఖ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. బీరంగూడ డివిజన్ పరి ధిలోని రాఘవేంద్ర కాలనీలో గల పోచమ్మ కుంట, అమీన్ పూర్ డివిజన్ పరిధిలోని దయారా పరిధిలోని జంగంకుం టల పరిధిలో చెరువు సరిహద్దులను నిర్ణయించి.. సుందరీక రణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూ చించారు.వడక్పల్లి గ్రామ చెరువు బఫర్ జోన్ పరిధిలో ప్ర ముఖ నిర్మాణ సంస్థ బఫర్ జోన్ ఆక్రమించి ప్రహరీ గోడ నిర్మించిందని స్థానికులు ఫిర్యాదు చేయడం జరిగిందని.. వెం టనే దానిని తొలగించి స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని ఆదే శించారు.భవిష్యత్తు తరాలకు నీటి వనరులను అందిస్తూ ప్ర కృతి సమతుల్యతకు కీలకమైన చెరువుల సంరక్షణ ప్రతి ఒ క్కరి సామాజిక బాధ్యతని..ఆక్రమణలకు పాల్పడితే క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.ఈ సమావే శంలో నీటిపారుదల శాఖ ఈఈ భీమ్, డిఈ బాల గణేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఉన్ని సంఘం ఎన్నికలు ప్రశాంతం

**86% పోలింగ్..**

**నేడు అధ్యక్ష ఎన్నికలు**



**వాస్తవం : అందోల్**

జోగిపేట ఉన్నిసంఘం ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. సొసైటీలోమొత్తం పది మంది డైరెక్టర్ల కుగాను ఇద్దరు మహిళలు ఏకగ్రీవం కాగా మిగతా ఏడు మందికి 9 మంది పోటీపడ్డారు. దీనికి మంగళవారం ఎన్నికలు జరిగాయి. పో లింగ్ మూసేసరికి 442 మంది ఓటర్లకు గాను 382 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో డైరెక్టర్లుగా దొడ్డ కృష్ణయ్య 317, గొల్ల నారాయణ 309, జుట్టు నరసింహులు 307, దండు నర్సిం లు 305, పూసిన సత్యనారాయణ 289, భామల్లపల్లి సంగమేశ్వర్ 287, బో డోల్ల సాయిలు 281 ఓట్లు పొంది విజయం సాధిం చారు. ఇందులో ఎన్నికైన వారు నేడు అధ్యక్షుని ఎన్నుకుం టారని ఎన్నికల అధికారి నిర్మల రాజకుమారి తెలిపారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛ నియా సంఘటనలు జరగ కుండా జోగిపే ట ఎస్సై శ్రీకాంత్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.


విలేకర్లు కావలెను
సీనియర్ జర్నలిస్ట్ మానసాని కృష్ణారెడ్డి సంపాదకత్వంలో వెలువడుతున్న అశేష పాఠకాదరణ ఉన్న
వాస్తవం జనోదయ

తెలుగు దినపత్రికలకు
విలేకర్లు కావలెను.
9618616110, 8074124190

# బాధితుల సమస్యల పరిష్కారానికి బాధ్యతగా పనిచేయాలి

**జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే**

**వాస్తవం : తంగళ్ళపల్లి**



ప్రజల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తు పోలీస్ స్టేషన్ల పనితీరు, నేరాల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందిస్తున్న సేవలను నిరంతరం పర్యవేక్షణలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే మంగళవారం తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈసందర్బంగా స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి,స్టేషన్ రికార్డుల నిర్వహణ,సిబ్బంది హాజరు, పెట్రోలింగ్ నిర్వహణ, రౌడీషీటర్లు, పాత నేరస్తులపై నిఘా తదితర అంశాలను క్షుణ్ణంగా సమీక్షించి, ప్రజలకు అందిస్తున్న పోలీసు సేవలపై ప్రత్యేకంగా ఆరా తీశారు.ఈసందర్బంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ..వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదులను అధికారులు బాధ్యతగా చట్టపరిధిలో పరిష్కరించాలని సూచించారు.సీసీటీఎన్ఎస్ 2.0 వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించి పోలీసు సేవలను మరింత వేగవంతంగా,పారదర్శకంగా అందించాలని తెలిపారు.స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పోలీస్ అధికారులు, సిబ్బంది గ్రామాలను తరచూ సందర్శిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని,శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా సేవలు అందించాలని, విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో సిరిసిల్ల డిఎస్పీ కె నాగేంద్రచారి,సిఐ నాగే శ్వరరావు,ఎస్ఐ లు ఉపేందర్ చారి,మల్లేష్,సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యవసాయ మోటార్ల కరెంట్ వైర్లు ఇనుప సామగ్రి చోరీ కేసుల్లో నలుగురు నిందితుల అరెస్ట్



**వాస్తవం : గంభీరావుపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో చోరీ కేసుల నియంత్రణలో భాగంగా గంభీరావుపేట పోలీసులు చేపట్టిన దర్యాప్తులో వ్యవసాయ బోర్ల వద్ద అమర్చిన విద్యుత్ మోటార్ల కరెంట్ వైర్లు, రైస్ మిల్‌లోని ఇనుప సామగ్రిని చోరీ చేసిన నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు.గంభీరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామ శివారులో వ్యవసాయ బావుల వద్ద అమర్చిన విద్యుత్ మోటార్ల కరెంట్ వైర్లను చోరీ చేసిన కేసు లింగన్నపేట గ్రామ శివారులోని శ్రీ లక్ష్మీ నారాయణ ఇండస్ట్రీస్ రైస్ మిల్‌లో ఇనుప రాడ్లు, ఇతర ఇనుప సామగ్రిని చోరీ చేసిన కేసు లకు సంబంధించి నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.ఈ క్రమంలో తేది 20-07-2026 సోమవారం అందిన విశ్వసనీయ సమాచారం మేరకు గంభీరావుపేట పోలీసులు నర్మాల గ్రామ శివారులోని అగస్త్య ఫుడ్ కంపెనీ సమీపంలో అనుమానాస్పదంగా ఆటోలో సంచరిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా, వారు నేరాలకు పాల్పడినట్లు వెల్లడించారు.

# జాతీయ రహదారి విస్తరణ పనుల్లో నాణ్యతకు తిలోదకాలు

**అధికారుల నిర్లక్ష్యంతో కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం**

**ప్రజల సొమ్ముతో చేసే పనుల్లో అవినీతి, నిర్లక్ష్యం సహించేది లేదు**

**ప్రమాణాలు పాటించకపోతే కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి నేరుగా ఫిర్యాదు చేస్తా: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**వాస్తవం : పటాన్ చెరు**



రూ. 1,200 కోట్ల భారీ వ్యయంతో మదీనాగూడ నుంచి సంగారెడ్డి వరకు చేపడుతున్న జాతీయ రహదారి--65 విస్తరణ పనుల్లో జరుగుతున్న తీవ్ర నిర్లక్ష్యం, నాణ్యతా లోపాలపై పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సౌకర్యం కోసం చేపట్టిన అభివృద్ధి పనులను కొందరు కాంట్రాక్టర్లు తమ స్వార్థ ప్రయోజనాలకు వేదికగా మార్చుకున్నారని మండిపడ్డారు.మంగళవారం సాయంత్రం పటాన్ చెరులోని తన క్యాంపు కార్యాలయంలో జాతీయ రహదారుల సంస్థ అధికారులు, కాంట్రాక్టర్ సంస్థ ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పటాన్ చెరు నియోజక వర్గ పరిధిలోని బీహెచ్ఈఎల్ చౌరస్తా నుంచి రుద్రారం గణేష్ గడ్డ వరకు జరుగుతున్న రహదారి విస్తరణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పూర్తిగా గాలికొదిలేశారని ఆయన ఆరోపించారు. నిర్మించిన కొద్ది రోజులకే సర్వీస్ రోడ్లు దెబ్బతినడం, వర్షపు నీటి కాలువలు కూలిపోవడం అధికారుల పర్యవేక్షణ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. రహదారి విస్తరణలో వెలికితీసిన విలువైన మట్టిని ప్రజా అవసరాలకు వినియోగించకుండా ప్రైవేట్ సంస్థలకు అమ్ముకోవడం అత్యంత బాధాకరమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులకు ఆ మట్టిని అందించాలని ఎన్నిసార్లు కోరినా స్పందించక పోవడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. రహదారి విస్తరణలో తొలగించిన మహనీయుల విగ్రహాలను పటాన్ చెరు సాకి చెరువు కట్టపై ప్రతిష్ఠించాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోకపోవడం ప్రజల మనోభావాలను దెబ్బతీయడమేనని అన్నారు. ఇప్పటివరకు 20 సార్లకు పైగా సమీక్ష సమావేశాలు నిర్వహించినా పనుల్లో ఎలాంటి మార్పు కనిపించక పోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. కాంట్రాక్టర్లు, అధికారులు వెంటనే తమ పనితీరును మార్చుకుని నాణ్యతతో పనులు పూర్తి చేయాలని, లేకపోతే ప్రజల తరపున కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లకు పూర్తి వివరాలతో ఫిర్యాదు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేలా చేస్తానని హెచ్చరించారు. ఈ సమీక్ష సమావేశంలో జాతీయ రహదారుల సంస్థ డీఈ సందీప్, కాంట్రాక్టర్ సంస్థ ప్రతినిధులు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## యువత మై భారత్ పోర్టల్లో నమోదు చేయాలి

**ఖమ్మం జిల్లా స్థానికసంస్థల అదనపు కలెక్టర్ డా.శ్రీజ**



**వాస్తవం - ఖమ్మం ప్రతినిధి**

కేంద్రప్రభుత్వం యువత కోసం ఏర్పాటు చేసిన 'మై భారత్ పోర్టల్' ద్వారా ప్రతి విద్యార్థికి అవకాశాలు చేరేలా చర్యలు తీసుకోవాలని ఖమ్మంజిల్లా స్థానికసంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం నిర్వహించిన యువజన కార్యక్రమాల సలహాసంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన 'మై భారత్ పోర్టల్' ద్వారా యువతకు పలురంగాల్లో అవకాశాలు కల్పిస్తోందన్నారు. ప్రస్తుతం జిల్లాలో దాదాపు 14వేలమంది యువత ఈ పోర్టల్లో నమోదు చేసుకున్నారని, ఈ సంఖ్య మరింత పెంచాలన్నారు. జిల్లాలో ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, నర్సింగ్ కళాశాలలతో పాటు అన్ని విద్యాసంస్థలను సందర్శించి ప్రతి విద్యార్థిని మై భారత్ పోర్టల్లో నమోదు చేయించాలని ఆదేశించారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులను తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ నిర్వహించి, విజేతలను రాష్ట్ర స్థాయికి పంపాలని, రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన వారికి భారత పార్లమెంట్‌లో పాల్గొనే అవకాశం లభిస్తుందని తెలిపారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో నిర్వహించే క్విజ్ పోటీల్లో విజేతలకు దేశంలోని సరి హద్దు రాష్ట్రాల పర్యటన అవకాశం లభిస్తుందని, కొన్ని కార్యక్రమాల్లో ప్రతిభ కనబరి చిన వారికి ప్రధానమంత్రిని కలిసే అవకాశం కూడా ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాలపై యువతలో విస్తృత ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించారు. నషా ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా వ్యాస రచన, చిత్రలేఖనం, తదితర ఎని మిది రకాల పోటీలు జిల్లాలో నిర్వహించాలని సూచించారు. జిల్లా స్థాయిలో విజేతలకు కేంద్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. యువతకు తమ భవిష్యత్ కెరీర్‌పై స్పష్టమైన అవగాహన కల్పించేందుకు ప్రతినెల చివరి ఆది వారం కెరీర్ గైడెన్స్ నిర్వహించాలని డా.శ్రీజ ఆదేశించారు.10వతరగతి, ఇంటర్ విద్య అనంతరం ఉన్నత విద్య, వివిధ ప్రవేశ పరీక్షలు, ఉద్యోగావకాశాలు, రక్షణ రంగం, వృత్తి రంగాలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించాలన్నారు.కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు సమర్థంగా నిర్వహించడం కోసం సంబంధిత శాఖల అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి, అవసరమైన అధ్యయన సామగ్రి, పరీక్షల విధానం, కెరీర్ మార్గదర్శక సమాచారాన్ని సిద్ధం చేసి విద్యార్థులకు నిరంతరం అందుబాటులో ఉంచా లని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ వెంకట్రామ్ బాబు, జిల్లా ఉపాధి అధికారి ఎన్.మాధవి, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జి.జ్యోతి, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎ.రవిప్రసాద్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు, యువజన క్రీడల జిల్లా అధికారి టి.సునీల్ రెడ్డి, జిల్లా పరిశ్రమలకేంద్రం జనరల్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శ్రీనివాసరావు, డీఈఓ, ఇతర అధికారులు పాల్గొన్నారు.


జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం
Red 914/2015
జర్నలిస్ట్ల సంక్షేమమే పరమావధిగా
జర్నలిస్ట్ల హక్కుల కోసం....
వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...
సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110

# భీమారం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన సీపీ

**వాస్తవం : చెన్నూర్ ఆర్ సి**

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా భీమారం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ఆయన ముందుగా స్టేషన్ పరిసరాలను పరిశీలించి,విధులు నిర్వహిస్తున్న అధికారులు,సిబ్బంది పనితీరును సమీక్షించారు. అనంతరం స్టేషన్‌కు సంబంధించిన వివిధ రికార్డులను పరిశీలించారు.ఎస్ఐ, స్టేషన్ రైటర్, సీసీటీఎన్ఎస్ రైటర్లతో మాట్లాడి, ఆన్‌లైన్‌లో వివరాల నమోదు,రికార్డుల అప్‌లోడ్ ప్రక్రియపై ఆరా తీశారు.స్టేషన్ పరిధిలో తరచుగా నమోదవుతున్న నేరాలు,పరిధిలోని గ్రామాల పరిస్థితులు, శాంతిభద్రతల పరిస్థితి,స్టేషన్ నిర్వహణ తదితర అంశాలపై ఎస్ఐని అడిగి తెలుసుకున్నారు.5ఎస్ విధానంలో భాగంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, బాధితులకు, ప్రజలకు అందిస్తున్న సేవలపై ప్రత్యేకంగా ఆరా తీశారు.రౌడీషీటర్లు,సస్పెక్ట్ షీటర్లు, నేరస్తుల ఇళ్లను తరచూ తనిఖీ చేయడంతో పాటు వారి కదలికలు, కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు.పోలీస్ స్టేషన్ పరిధిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.అలాగే, తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్‌స్పాట్లను గుర్తించి,ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలు, సంస్థలతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.



# స్వర్గీయ సువర్ణ వనమాలకి రామగుండం ఎమ్మెల్యేనివాళి



**వాస్తవం : రామగుండం,జులై,21**

మంథనిలోని తెలంగాణ రాష్ట్ర ఐటీ , పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అత్తమ్మ, స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు అక్క, మంథని మాజీ సర్పంచ్ స్వర్గీయ సువర్ణ వనమాల (91) పార్థివ దేహానికి రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన అంత్రక్రియల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం , ఆల్ఫోర్ నరేందర్ రెడ్డి , దుద్దిళ్ల శ్రీను బాబు , రామగుండం మేయర్ మహంకాళి స్వామి , ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్ , ప్రజాప్రతినిధులు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# చర్ల పిఎసిఎస్ చైర్మన్‌గా బండారు రామకృష్ణకు అవకాశం ఇవ్వాలి

**డీసీసీ అధ్యక్షురాలు దేవి ప్రసన్నను కలిసిన కాంగ్రెస్ నాయకులు**

**వాస్తవం : చర్ల**

చర్ల మండల కాంగ్రెస్ పార్టీలో గత 30 సంవత్సరాలుగా కష్టపడుతున్న సీనియర్ నాయకుడు బండారు రామకృష్ణకి చర్ల పిఎసిఎస్ చైర్మన్ పదవి ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న ని చర్ల మండల కాంగ్రెస్ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గతంలో బిఆర్ ఎస్ పార్టీ నుండి అనేక ఇబ్బందులు ఎదురైనా బండారు రామకృష్ణ కాంగ్రెస్ పార్టీని విడిచిపెట్టకుండా, గ్రామస్థాయి నుండి పార్టీని పటిష్టం చేశారని తెలిపారు. కార్యకర్తలకు అండగా నిలుస్తున్న రామకృష్ణ పిఎసిఎస్ చైర్మన్ పదవికి పూర్తి అర్హుడని పేర్కొన్నారు.అదేవిధంగా గతంలో చర్ల మండల అధ్యక్షుడి నియామకంలో సీనియర్ నాయకులు, జిల్లా కమిటీ సభ్యుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని కూడా నాయకు లు తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యకర్తలు, నాయకుల అభిప్రాయాలను విన్న డీసీసీ అధ్యక్షురాలు దేవి ప్రసన్న మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం కష్ట పడే వారికి తప్పకుండా తగిన గుర్తింపు, స్థానం లభిస్తుందని హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ గౌడ్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేరిన నాయకులకు నామినేటెడ్ పదవుల్లో ఎటువంటి ప్రాధాన్యత ఉండ దని, మెజార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాల మేరకే పార్టీ పదవులు ఉంటాయని ఆమె భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు చింతిర్యాల రవికుమార్, చర్ల పిఎసిఎస్ చైర్మన్ పరుచూరి రవికుమార్, నూగురు మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్ప శ్రీనివాసరావు, ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల బుచ్చిబాబు, మండల మాజీ అధ్యక్షులు ఆవుల విజయ భాస్కర్ రెడ్డి, యూత్ అధ్యక్షులు జితేంద్ర నాయుడు, సర్పంచులు మంగమ్మ, అశోక్ కుమార్, మాజీ ఎంపీటీసీ కాక ధర్మయ్య తో పాటు పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఓటరు సవరణను పరిశీలించిన కొమ్మూరి ప్రతాప్ రెడ్డి



**వాస్తవం : మద్దూరు**

కొమురవెల్లి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి మంగళవారం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా బూత్ లెవెల్ ఏజెంట్లు,పార్టీ శ్రేణులకు ఆయన పలు సూచనలు చేశారు.ప్రజాస్వామ్యానికి ఓటే పునాది అని, అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా జాబితా నుండి మినహాయించబడకుండా కాంగ్రెస్ కార్యకర్తలు బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఇంటింటికీ వెళ్లి కొత్త ఓటర్ల నమోదు, మార్పులు,చేర్పుల దరఖాస్తులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. గ్రామ శాఖ అధ్యక్షులు, బూత్ లెవెల్ ఏజెంట్లు, మండల నాయకులు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి అర్హుడి ఓటు హక్కును కాపాడేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మండలంలో ఓటరు నమోదు కార్యక్రమం జరుగుతున్న తీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.ఇదే ఉత్సాహంతో పార్టీ శ్రేణులంతా నిరంతరం ప్రజల్లో ఉంటూ,కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శ్రమించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ప్రెసిడెంట్ మహాదేవుని శ్రీనివాస్,పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మన్యం కోల్పోయిన మహనీయుడు

**సేవా సామ్రాట్ జవ్వాది ఉమామహేశ్వరరావు కన్నుమూత**

**హైదరాబాద్ తీసుకెళ్తుండగా మార్గమధ్యలో హఠాన్మరణం**

**వాస్తవం : చర్ల**

చర్ల మండలానికి ఆపన్న హస్తం, నిరుపేదలకు పెన్నిధి, సీనియర్ కాంట్రాక్టర్, అఖిల హాస్పిటల్ చైర్మన్ జవ్వాది ఉమా మహేశ్వరావు (63) సోమవారం రాత్రి హఠాత్తుగా కన్నుమూశారు.ఆయన భార్య వాణి చక్రకుమారి ప్రభుత్వ ఉపాధ్యాయురాలు.ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇద్దరికీ వివాహాలు అయ్యాయి. వైద్యం నిమిత్తం హైదరాబాద్ తీసుకెళ్తుండగా మార్గమధ్యలో సోమవారం రాత్రి 7.30 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచారు. ఈ వార్త తెలియగానే చర్ల మండలమంతా విషాదంలో మునిగిపోయింది. రైసుపేటకు చెందిన ఉమామహేశ్వరావు చర్లలో అఖిల హాస్పిటల్‌ను స్థాపించి కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని పేదలకు అందుబాటులోకి తెచ్చారు. కరోనా సమయంలో ఆస్పత్రి తలుపులు 24 గంటలు తెరిచి ఉంచి ఎంతోమంది ప్రాణాలు కాపాడారు. డబ్బు లేక వైద్యం ఆగిపోకూడదనే సిద్ధాంతంతో నిరుపేదలకు ఉచితంగా వైద్యం అందించేవారు. ఉపాధి కల్పనలో ఆయనది ప్రత్యేక స్థానం. కాంట్రాక్టర్‌గా వేలాది మందికి పని కల్పించారు. గిరిజన గ్రామాల్లో ఆయన అంటే ప్రత్యేక అభిమానం. సహాయం అడిగి వచ్చిన వారిని ఎప్పుడూ కాదనలే దు. చేరదీసి ఆదుకునేవారు. మం డలంలో మంచి పేరున్న వ్యక్తిగా, అందరితో ఆప్యాయంగా మెలిగే నాయకుడిగా ఆయనకు గుర్తింపు ఉంది.ఉమా మహేశ్వరరావు మృతి వార్త తెలిసి పలు వురు ప్రజాప్రతిని ధులు, పార్టీ నాయకు లు, కార్యక ర్తలు ఆయన ఇంటికి చేరుకుని నివాళులు అర్పిం చారు. "చర్ల మం డలం ఒక పెద్ద దిక్కును కోల్పోయింది. ఆయన సేవలు మరువలేనివి" అని స్థానికులు కన్నీరు పెట్టుకున్నారు.



# నేను కేసీఆర్‌లా మంచోడిని కాదు

**బీఆర్ఎస్ కార్యకర్తలను వేధిస్తే వదిలిపెట్టం**

**ఇకనైనా పద్ధతి మార్చుకోవాలి**

**మంచిర్యాల ఎమ్మెల్యేకు కేటీఆర్ వార్నింగ్**

**కరువు రావొద్దనే కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించారు**

**31 నెలలుగా కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు మరమ్మతులు చేయలేదు**

**సీఎం రేవంత్ రెడ్డికి తెలిసింది రెండే ..ఒకటి ఓట్లు, రెండోది తిట్లు**

**రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై కేటీఆర్ మండిపాటు**

**మంచిర్యాల, జులై 21 :** బీఆర్ఎస్ కార్యకర్తలను ఇబ్బంది పెడుతున్న వారిని వదిలిపెట్టేది లేదని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హెచ్చరించారు. ఈ తరహా చర్యలకు పాల్పడుతున్నవారిని ఒక్కరిని కూడా వదలమని ఆయన స్పష్టం చేశారు. అతి చేస్తున్న అధికారులు రిటైర్డ్ అయినా తర్వాత కూడా గుంజుకొచ్చి ప్రజల ముందు నిలబెడతా మని అన్నారు. బీఆర్ఎస్ నాయకులను క్షోభ పెడితే వదిలిపెట్టమని పేర్కొన్నారు. తాను కేసీఆర్‌లా మంచోడిని కాదని, ఇకనైనా పద్ధతి మార్చుకోవాలంటూ మంచిర్యాల ఎమ్మె ల్యేకు ఆయన హితవు పలికారు. మంగళవారం మంచిర్యాలలో కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కరువు రావొద్దనే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించారని గుర్తు చేశారు.31 నెలలుగా కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు మరమ్మతులు చేయలేదని రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై కేటీఆర్ మండిపడ్డారు. ఈ ప్రాజెక్టుకు మరమ్మతులు చేయాల్సిన ఎల్ అండ్ టీ సంస్థను కూడా బెదిరించారని ఆరోపించారు. గోదావరి నది ఏపీకి తరలుతోంది.. అక్కడ పట్టిసీమ పారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి తెలిసింది రెండేనని.. ఒకటి ఓట్లు, రెండోది తిట్లు అని వ్యంగ్యంగా అన్నారు. ఏం జాతి మీది అని సీఎం రేవంత్ రెడ్డి తరచూ అంటున్నారని కేటీఆర్ గుర్తు చేశారు. తెలంగాణలో ఉన్నవి రెండే జాతులని వివరించారు. ఒకటి తెలంగాణను ప్రేమించే జాతి.. రెండోది ద్వేషించే జాతి అని కేటీఆర్ స్పష్టం చేశారు.



# శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి బోనాలకు కేటీఆర్‌కు ఆహ్వానం



**వాస్తవం, జులై 21, గ్రేటర్ హైదరాబాద్**

హైదరాబాద్ లోని చారిత్రాత్మకమైన శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి ఆలయంలో వచ్చే నెల 9 న నిర్వహించే 78వ వార్షిక బోనాల పండుగ ఉత్సవాల్లో పాల్గొనాలని కోరుతూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావును ఆలయ కమిటి బృందం ఆహ్వానించారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ నంది నగర్ లోని ఆయన నివాసంలో కేటీఆర్ ను కలిసి బోనాల నిర్వహణపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి అధ్యక్షుడు డి.ప్రభాకర్, కార్యదర్శి కె.దత్తాత్రేయ, కోశాధికారి ఏ.సతీష్, కార్యనిర్వహక కార్యదర్శి ఎస్.పి.క్రాంతి కుమార్, ఉపాధ్యక్షులు జగ్మోహన్ కపూర్, ఎం.వినోద్ కుమార్, సభ్యులు పి.సాయికిరణ్, రవీందర్ చారి, ఎల్.అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# చర్లలో 'నేరుగా విత్తే వరి సాగు' పై అవగాహన

**వాస్తవం : చర్ల**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని లెనిన్‌నగర్, ఉంజుపల్లి, దోసిల్లపల్లి , దేవరపల్లి గ్రామాల్లో భారతీయ వరి పరిశోధనా సంస్థ - ఐ కార్ - ఐ ఐ ఆర్ ఆర్ , హైదరాబాద్ మరియు ఎస్‌బీఐ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'నేరుగా విత్తే వరి సాగు - డైరెక్ట్ సీడెడ్ రైస్ - డి ఎస్ ఆర్' పై అవగా హన మరియు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు.భారతీయ వరి పరిశోధనా సంస్థ రీసెర్చ్ అసోసియేట్ డా. ఎస్. కవి రాజు మాట్లాడుతూ నేరుగా విత్తే వరి సాగు పద్ధతి, విత్తన శుద్ధి, కలుపు నివారణ, నీటి యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. ఎల్‌నినో పరిస్థితుల్లో ఈ పద్ధతి వల్ల నీటి వినియోగం, సాగు ఖర్చులు తగ్గడంతో పాటు స్థిరమైన దిగుబడులు సాధించవచ్చున్నారు. కరువు ముప్పు ఉన్నందున రైతులు అరుత డుల నీటి పారుదల పద్ధతులను పాటించాలని సూచించారు.వ్యవసాయ విస్తరణ అధి కారి ఆఫ్రిద్ మహమ్మద్ మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగు ణంగా డీఎస్ఆర్ వంటి ఆధునిక సాంకేతికతలను రైతులు స్వీకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మైరాడా స్వచ్ఛంద సంస్థ కమ్యూనిటీ ఆర్గనైజర్ నవీన్ పాల్గొని డిఎస్ ఆర్ సాగు చేస్తున్న రైతులకు తమ సంస్థ అందిస్తున్న ప్రోత్సాహకాల గురించి వివరిం చారు. ప్రాజెక్ట్ యంగ్ ప్రొఫెషనల్ శ్రీకాంత్ కార్యక్రమ నిర్వహణలో సహకరించారు. శిక్షణ కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో రైతులు సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

## గ్లోబల్ ఎడ్యుకేషన్ మోడల్స్ ...

# మనమెక్కడ ఉన్నాం?



డా. సూర్యదేవర రామకృష్ణ
9490754169



ప్రతి సంవత్సరం పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాలు వెలువడగానే మన రెండు తెలుగు రాష్ట్రాల్లో ఒక వింతైన, ఆందోళనకరమైన దృశ్యం ఆవిష్కృతమవుతుంది. ర్యాంకుల కోసం విద్యార్థుల హోరాహోరీ పరుగు, మార్కుల వేటలో తల్లిదండ్రుల నిరంతర ఆందోళన, ఈ మానసిక ఒత్తిడి తాళలేక కొందరు లేత మొగ్గలు తీసుకునే విషాదకర నిర్ణయాలు ఇవన్నీ ఇప్పుడు మన సమాజంలో, విద్యారంగంలో సర్వసాధారణమైన రోజువారీ వార్తలుగా మారిపోవడం అత్యంత విచారకరం. అయితే ప్రపంచంలో అగ్రస్థానంలో నిలిచే ఫిన్లాండ్, సింగపూర్, జపాన్ వంటి దేశాల్లో పరిస్థితి దీనికి పూర్తిగా భిన్నంగా ఉంటుంది. అక్కడ పిల్లలు ఎలాంటి ఒత్తిడి లేకుండా ఎంతో సంతోషంగా చదువుకుంటారు, అయినా ప్రపంచ స్థాయి ర్యాంకింగుల్లో ఎప్పుడూ ముందంజలోనే నిలుస్తారు. ఈ వ్యత్యాసానికి కారణమేమిటి? మన నిధుల కేటాయింపులో లోపమా, అనుసరిస్తున్న విధానాల్లో లోపమా, లేక మన ఆలోచనా ధోరణిలోనే తేడా ఉందా? ఈ విషయాలపై లోతైన విశ్లేషణ అవసరం.

**ఫిన్లాండ్ మోడల్ : పోటీ లేని స్వేచ్ఛా విద్య**

ఫిన్లాండ్ విద్యా విధానం ప్రపంచ వ్యాప్తంగా విద్యావేత్తలను ఆకర్షిస్తున్న ఒక గొప్ప అధ్యయన అంశం. అక్కడ పిల్లలకు దాదాపు 16 ఏళ్ల వయసు వచ్చే వరకు ఎటువంటి ప్రామాణిక పరీక్షలు (స్టాండర్డైజ్డ్ టెస్ట్‌లు) ఉండవు. పాఠశాలల మధ్య ర్యాంకింగ్ పోరు కానీ, మన దగ్గర రాజ్యమేలుతున్న ప్రైవేట్ ట్యూషన్ సంస్కృతి కానీ అక్కడ అస్సలు కనిపించవు. ఉపాధ్యాయ వృత్తికి సమాజంలో అత్యున్నత గౌరవం ఉంటుంది. ప్రతి ఉపాధ్యాయుడు తప్పనిసరిగా మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. అక్కడ ఉపాధ్యాయ శిక్షణ కోర్సుల్లో ప్రవేశం పొందడం వైద్య విద్యలో సీటు సాధించడమంత కష్టంతో కూడుకున్న పని. తరగతి గదిలో ఉపాధ్యాయులకు పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. స్థానిక అవసరాలకు అనుగుణంగా పాఠ్యప్రణాళికను మార్చుకునే వెసులుబాటు వారికి ఉంటుంది. అయితే ఇటీవలి కాలంలో ఫిన్లాండ్ అంతర్జాతీయ ("పిఐఎస్ఏ" ) ర్యాంకుల్లో కొంత క్షీణతను చవిచూసింది. 2000వ సంవత్సరంలో అగ్రస్థానంలో ఉన్న ఫిన్లాండ్, 2022 నాటికి ఎస్టోనియా, కెనడా వంటి దేశాల వెనక్కి తగ్గింది. తరగతి గదుల్లో అతిగా డిజిటల్ పరికరాల వాడకం, స్వీయ-నియంత్రిత అభ్యాస పద్ధతుల్లో దొర్లిన కొన్ని లోపాలే దీనికి కారణమని విద్యా నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అంటే ఫిన్లాండ్ మోడల్ కూడా సంపూర్ణమైనది కాదనే వాస్తవాన్ని మనం గ్రహించాలి.

**సింగపూర్, జపాన్: క్రమశిక్షణతో కూడిన ప్రతిభ:**

సింగపూర్ విద్యా విధానం మరో రకమైన విశిష్టతను కలిగి ఉంది. కఠినమైన పాఠ్య ప్రణాళిక, ఉన్నత ప్రమాణాలు, ఉపాధ్యాయుల బలమైన మార్గదర్శకత్వం కలిసి అక్కడి విద్యార్థులను ప్రపంచ అగ్రస్థానంలో నిలుపుతున్నాయి. తాజా "పిఐఎస్ఏ" ఫలితాల్లో గణితం, సైన్సులతో పాటు సృజనాత్మక ఆలోచనా శక్తి విభాగంలో కూడా సింగపూర్ ప్రపంచంలోనే ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఇక్కడ గమనించాల్సిన ఆసక్తికరమైన అంశమేమిటంటే, సింగపూర్‌లో ఆర్థికంగా బాగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులు కూడా సగటు అంతర్జాతీయ స్థాయి కంటే మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు. అంటే అక్కడి విద్యా వ్యవస్థ సామాజిక, ఆర్థిక అంతరాలను దాదాపుగా తుడిచి పెట్టగలుగుతోంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ద్వారా అక్కడ ఉపాధ్యాయుల నియామకం, శిక్షణ అత్యంత శాస్త్రీయంగా జరుగుతాయి. మరోవైపు జపాన్‌లో క్రమశిక్షణ, నైతిక విలువలు, సమిష్టి బాధ్యత అనే అంశాలు పాఠశాల విద్యలో అంతర్భాగంగా ఉంటాయి. జపాన్ పాఠశాలల్లో విద్యార్థులే స్వయంగా తమ తరగతి గదులను, పాఠశాల ఆవరణను శుభ్రం చేసుకుంటారు. దీనిద్వారా జాతీయ బాధ్యతను, సమానత్వాన్ని వారు చిన్నతనం నుంచే అలవర్చుకుంటారు.

**నిధుల ఖర్చు : కేటాయింపులా? కార్యాచరణా?**

ఇక్కడ మనకు ఒక ఆసక్తికరమైన నిజం కనిపిస్తుంది. విద్యపై అత్యధికంగా నిధులు ఖర్చు చేసే దేశాలే ఎప్పుడూ అగ్రస్థానంలో ఉండవు. ప్రపంచ బ్యాంకు నివేదికల ప్రకారం, స్వీడన్, డెన్మార్క్ వంటి దేశాలు తమ మొత్తం జీడీపీలో 6 శాతానికి పైగా విద్యపై వెచ్చిస్తుండగా, సింగపూర్ కేవలం 2 నుంచి 2.5 శాతం మాత్రమే ఖర్చు చేస్తుంది. అయినప్పటికీ ఫలితాల్లో సింగపూర్ ఎంతో ముందంజలో ఉంది. దీనికి ప్రధాన కారణం ఖర్చు చేసే విధానంలో ఉన్న పారదర్శకత, సామర్థ్యం, జవాబుదారీతనం మరియు ఉపాధ్యాయుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించడం. జపాన్ కూడా జీడీపీలో సుమారు 3.3 నుంచి 4 శాతం మధ్యే ఖర్చు చేస్తున్నా, ఫలితాల్లో ఎప్పుడూ ముందు వరుసలోనే నిలుస్తోంది. ఫిన్లాండ్ గతంలో 6 శాతానికి పైగా ఖర్చు చేసినప్పటికీ, ఇటీవలి ఆర్థిక పరిస్థితుల వల్ల ఆ కేటాయింపు 5.5 శాతానికి తగ్గింది. కాబట్టి కేవలం నిధుల పరిమాణం మాత్రమే కాదు, ఆ నిధులను ఏ విధంగా, ఏ రంగానికి ఉపయోగిస్తున్నామనేదే అత్యంత కీలకమైన అంశం.

**మన భారతదేశ పరిస్థితి ఏమిటి?**

ఇప్పుడు మన దేశ విద్యా రంగాన్ని ఒకసారి పరిశీలిద్దాం. నూతన జాతీయ విద్యా విధానం (నేప్ ) 2020 ప్రకారం విద్యపై జీడీపీలో కనీసం 6 శాతం ఖర్చు చేయాలని స్పష్టమైన లక్ష్యంగా పెట్టుకున్నాం. కానీ వాస్తవ గణాంకాలు వేరేలా ఉన్నాయి. ఇటీవలి ఆర్థిక సర్వే ప్రకారం, కేంద్ర ప్రభుత్వ విద్యా వ్యయం 2020లో జీడీపీలో 2.9 శాతం ఉండగా, 2026 నాటికి అది 2.7 శాతానికి పడిపోయింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మొత్తం వ్యయాన్ని కలిపి చూసినా ఇది 4 నుంచి 4.6 శాతం మధ్యే పరిమితమవుతోంది తప్ప, అనుకున్న 6 శాతం లక్ష్యాన్ని అందుకోలేకపోతోంది. ఇది దక్షిణాఫ్రికా (6%), బ్రెజిల్ (5.6%), చైనా, రష్యాల (4%) కంటే తక్కువగా ఉంది. మన కంటే తక్కువ ఆదాయం ఉన్న దేశాల సగటు (3.4%) కంటే కూడా మన కేటాయింపులు అసంతృప్తికరంగానే ఉన్నాయి. 2025-26 కేంద్ర బడ్జెట్‌లో విద్యా శాఖకు రూ. 1.28 లక్షల కోట్లు కేటాయించినప్పటికీ, మొత్తం బడ్జెట్‌లో ఇది కేవలం 2.5 నుంచి 2.6 శాతం మాత్రమే కావడం గమనార్హం. మరోవైపు, ఉపాధ్యాయ శిక్షణలో సరైన నాణ్యత లేకపోవడం, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు, నిరంతరం మారే పాఠ్యప్రణాళికలు, కేవలం పరీక్షల ఆధారిత మూల్యాంకనం మన వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. మన దగ్గర ఇప్పటికీ మార్కులు, ర్యాంకులే విద్యార్థి ప్రతిభకు కొలమానంగా మారుతున్నాయి. బట్టీ పద్ధతులకే ప్రాధాన్యం దక్కుతుండగా, క్రిటికల్ థింకింగ్, సృజనాత్మకతకు తగిన చోటు లభించడం లేదు. దీనికి కార్పొరేట్ విద్యా సంస్థల తీవ్రమైన ఒత్తిడి, తల్లిదండ్రుల అధిక అంచనాలు తోడై విద్యార్థుల మానసిక ఆరోగ్యానికి పెద్ద ముప్పుగా పరిణమిస్తున్నాయి. విద్యకు ఇచ్చే ప్రాధాన్యతలే ఉత్తమ ఫలితాలను ఇస్తాయని స్పష్టమవుతుంది. స్వీడన్, డెన్మార్క్ వంటి దేశాలు తమ జీడీపీలో 6% కంటే ఎక్కువ ఖర్చు చేస్తూ స్వేచ్ఛాయుత వాతావరణాన్ని అందిస్తుండగా, ఫిన్లాండ్ 5.5% నుండి 6% వెచ్చిస్తూ పరీక్షల ఒత్తిడి లేని బోధన, ఉపాధ్యాయులకు అత్యున్నత గౌరవాన్ని ఇస్తోంది. విచిత్రంగా సింగపూర్ కేవలం 2% నుండి 2.5% వ్యయం చేసినప్పటికీ, పారదర్శకత, నాణ్యతతో ప్రపంచంలోనే అత్యుత్తమ సామర్థ్యాన్ని ప్రదర్శిస్తోంది. జపాన్ 3.3% నుండి 4% ఖర్చు చేస్తూ విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలను పెంపొందిస్తోంది. కానీ భారత్‌లో కేంద్ర, రాష్ట్రాల మొత్తం వ్యయం కలిపి 4% నుండి 4.6% ఉన్నప్పటికీ, సరైన విధానాలు లేక ర్యాంకుల ఒత్తిడి, బట్టీ చదువులకే పరిమితమవుతోంది. దీనిని బట్టి నిధుల పరిమాణం మాత్రమే కాదు, ఆచరణలో చూపే నైపుణ్యమే అసలైన నాణ్యమైన విద్యను అందిస్తుందని అర్థమవుతోంది.

**మన దేశ విద్యా రంగాన్ని ఒకసారి పరిశీలిద్దాం. నూతన జాతీయ విద్యా విధానం (నేప్ ) 2020 ప్రకారం విద్యపై జీడీపీలో కనీసం 6 శాతం ఖర్చు చేయాలని స్పష్టమైన లక్ష్యంగా పెట్టు కున్నాం. కానీ వాస్తవ గణాంకాలు వేరేలా ఉన్నాయి. ఇటీవలి ఆర్థిక సర్వే ప్రకారం, కేంద్ర ప్రభుత్వ విద్యా వ్యయం 2020లో జీడీపీలో 2.9 శాతం ఉండగా, 2026 నాటికి అది 2.7 శాతానికి పడిపోయింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మొత్తం వ్యయా న్ని కలిపి చూసినా ఇది 4 నుంచి 4.6 శాతం మధ్యే పరిమితమవుతోంది తప్ప, అనుకున్న 6 శాతం లక్ష్యాన్ని అందుకోలే కపోతోంది.ఇది దక్షిణాఫ్రికా (6%), బ్రెజిల్ (5.6%), చైనా, రష్యాల (4%) కంటే తక్కువగా ఉంది. మన కంటే తక్కువ ఆదాయం ఉన్న దేశాల సగటు (3.4%) కంటే కూడా మన కేటాయిం పులు అసంతృప్తికరంగానే ఉన్నాయి. 2025-26 కేంద్ర బడ్జెట్‌లో విద్యా శాఖకు రూ.1.28 లక్షల కోట్లు కేటాయించిన ప్పటికీ, మొత్తం బడ్జెట్‌లో ఇది కేవలం 2.5 నుంచి 2.6 శాతం మాత్రమే కావడం గమనార్హం.**

మన విద్యా వ్యవస్థలోని లోపాలను అర్థం చేసుకోవాలంటే కేవలం జాతీయ సగటు గణాంకాలతో సరిపోదు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు, పట్టణాల్లోని కార్పొరేట్ పాఠశాలలకు మధ్య నాణ్యతలో కొండంత వ్యత్యాసం ఉంది. ఒకే దేశంలో, ఒకే వయసు పిల్లలకు విద్యాబోధనలో పూర్తిగా భిన్నమైన అనుభవాలు ఎదురవుతున్నాయి. ఫిన్లాండ్ నమూనాలోని ప్రధాన సూత్రం ఏమిటంటే అక్కడ ఏ మూలన ఉన్న పాఠశాలలో చేరినా విద్యార్థికి సమానమైన నాణ్యతతో కూడిన విద్య లభిస్తుంది. మన దగ్గర మాత్రం తల్లిదండ్రుల జేబు బలాన్ని బట్టి విద్యార్థికి లభించే విద్య నాణ్యత నిర్ణయమవుతోంది. గ్రామీణ పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ కాకపోవడం, ప్రయోగశాలలు, మరుగుదొడ్ల వంటి కనీస మౌలిక వసతులు లేకపోవడం పేద విద్యార్థులను చదువులో మరింత వెనక్కి నెడుతున్నాయి. ఈ సామాజిక అసమానతను తొలగించకుండా కేవలం బడ్జెట్ కేటాయింపులు పెంచినంత మాత్రాన ఆశించిన ఫలితాలు రావు.

**ఉపాధ్యాయ శిక్షణ : పునాది మారాలి:**

ఫిన్లాండ్, సింగపూర్ దేశాల విజయంలో ఉమ్మడి సూత్రం ఉపాధ్యాయుల ఎంపిక, శిక్షణా విధానం అత్యంత కఠినంగా ఉండటమే. ఫిన్లాండ్‌లో ఉపాధ్యాయ కోర్సుల్లో సీటు సంపాదించడం ఎంతో శ్రమతో కూడుకున్న పని. సింగపూర్‌లో నిరంతర శిక్షణ, ప్రత్యక్ష బోధనా పరిశీలన తప్పనిసరి. మన దేశంలో ఉపాధ్యాయ శిక్షణ కళాశాలల తీరుపై తీవ్రమైన విమర్శలు ఉన్నాయి. అనేక ప్రాంతాల్లో డీఎడ్, బీఎడ్ కళాశాలలు కేవలం సర్టిఫికెట్లు ఇచ్చే దుకాణాలుగా మారిపోయాయన్నది నిష్ఠుర సత్యం. ఉపాధ్యాయులకు సమాజంలో సముచిత గౌరవం, మంచి వేతనాలు, బోధనా స్వేచ్ఛ లభించినప్పుడే సమాజంలోకి నాణ్యమైన బోధన వస్తుంది. ఇది కేవలం జీతాల పెంపుతో ముడిపడిన అంశం కాదు, ఉపాధ్యాయ వృత్తి పట్ల సమాజంలో రావలసిన మానసిక మార్పు.

**మనకు కావలసిన సరైన మార్గం:**

ఫిన్లాండ్, సింగపూర్, జపాన్ దేశాలు వేర్వేరు నమూనాలను అనుసరించి విజయవంతమయ్యాయి. కానీ వాటన్నింటిలో ఉన్న ఉమ్మడి అంశం ఉపాధ్యాయులకు ఇచ్చే గౌరవం, నాణ్యమైన శిక్షణ, నిలకడైన విద్యా విధానాలు మరియు పరీక్షల ఒత్తిడి లేని అభ్యాస వాతావరణం. కేవలం బడ్జెట్ పెంచినంత మాత్రాన అద్భుతాలు జరగవు, అలాగని నిధుల కొరతను సరిచేయకుండా ఊరుకోలేం. భారత్‌కు ప్రస్తుతం అత్యంత అత్యవసరమైనది కేటాయించిన నిధులను చిత్తశుద్ధితో వినియోగించే పారదర్శక వ్యవస్థ, ఉపాధ్యాయ శిక్షణలో విప్లవాత్మక మార్పులు, మరియు మార్కుల వేట నుంచి నైపుణ్యాల వైపు విద్యావ్యవస్థను మళ్లించడం. ప్రభుత్వాలు మారినా విద్యా విధానాల్లో స్థిరత్వం, స్పష్టమైన నిబద్ధత కొనసాగాలి. అప్పుడే మన పిల్లలు ఒత్తిడి లేని వాతావరణంలో, నిజమైన విజ్ఞానంతో ప్రపంచ వేదికపై సగర్వంగా పోటీ పడగలుగుతారు.

# ప్రజాస్వామ్యంలో అధికారం గొప్పదా?...జవాబుదారీతనం గొప్పదా?



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496

భారత ప్రజాస్వామ్యం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా గుర్తింపు పొందింది. అయితే ప్రజాస్వామ్యానికి అసలైన బలం కేవలం ఎన్నికలు కాదు; రాజ్యాంగబద్ధమైన హక్కులను గౌరవించడం, శాంతియుత నిరసనలను సహించడం, అధికార వ్యవస్థ ప్రజలకు జవాబుదారీగా ఉండడం కూడా అంతే ముఖ్యమైనవి. ఇటీవలి కాలంలో విద్యార్థుల ఆందోళనలు, పోటీ పరీక్షల నిర్వహణపై వచ్చిన వివాదాలు, వాటి నేపథ్యంలో జరిగిన పోలీసు చర్యలు, రాజకీయ బాధ్యతపై జరిగిన చర్చలు దేశంలో ప్రజాస్వామ్య నాణ్యత గురించి మరోసారి ప్రశ్నలు లేవనెత్తాయి. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 ప్రకారం భావప్రకటన స్వేచ్ఛ, శాంతియుతంగా సమావేశం కావడం, నిరసన వ్యక్తం చేయడం వంటి హక్కులు పౌరులకు కల్పించబడ్డాయి. ఈ హక్కులు పరిమితులకు లోబడి ఉన్నప్పటికీ, ప్రజాస్వామ్యంలో అసమ్మతి వ్యక్తం చేయడం దేశద్రోహం కాదని సుప్రీంకోర్టు అనేక సందర్భాల్లో స్పష్టం చేసింది. నిరసన తెలిపే ప్రతి వ్యక్తిని శత్రువుగా చూడకుండా, ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామిగా చూడాలనే భావన రాజ్యాంగ ఆత్మకు దగ్గరగా ఉంటుంది. భారత పోలీసు వ్యవస్థ ఇప్పటికీ వలస పాలనలో రూపొందిన 1861 పోలీసు చట్టం ప్రభావం నుంచి పూర్తిగా బయటపడలేదనే విమర్శ చాలా కాలంగా వినిపిస్తోంది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత రాజ్యాంగం మారినా, పోలీసు వ్యవస్థలో పౌరహక్కులు, మానవహక్కులు, సమాజంతో స్నేహపూర్వక సంబంధాలపై శిక్షణ తగిన స్థాయిలో పెరగలేదని అనేక కమిషన్లు పేర్కొన్నాయి. జాతీయ పోలీసు కమిషన్, రిబెయిరో కమిటీ, మలిమత్ కమిటీ, ప్రకాష్ సింగ్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలు పోలీసు సంస్కరణల అవసరాన్ని నొక్కిచెప్పాయి. అయినప్పటికీ చాలా రాష్ట్రాల్లో ఆ సంస్కరణలు పూర్తి స్థాయిలో అమలు కాలేదనే అభిప్రాయం న్యాయ నిపుణులలో ఉంది. దేశంలో పోలీసు కస్టడీ మరణాలు, అక్రమ నిర్బంధాలు, అధిక బలప్రయోగం వంటి అంశాలపై జాతీయ మానవ హక్కుల కమిషన్, పౌరహక్కుల సంస్థలు తరచూ ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. జాతీయ నేర గణాంకాల బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) మరియు మానవ హక్కుల సంస్థల నివేదికలు ప్రతి ఏడాది కస్టడీ మరణాలు, పోలీసు దుర్వినియోగ ఆరోపణలు నమోదవుతున్నాయని సూచిస్తున్నాయి. ప్రతి ఆరోపణ నిజమని చెప్పలేనప్పటికీ, పారదర్శక విచారణ, బాధ్యులపై చట్టపరమైన చర్యలు, బాడీ కెమెరాలు, సీసీటీవీ పర్యవేక్షణ, మానవ హక్కుల శిక్షణ వంటి సంస్కరణలు మరింత బలోపేతం కావాలనే అవసరాన్ని ఈ గణాంకాలు గుర్తుచేస్తాయి. ఇటీవలి కాలంలో పోటీ పరీక్షల నిర్వహణ కూడా తీవ్రమైన చర్చకు దారితీసింది. నీట్, యూజీసీ-నెట్ వంటి పరీక్షలకు సంబంధించి ప్రశ్నాపత్రాల భద్రత, నిర్వహణలో లోపాలపై వివాదాలు వెలువడ్డాయి. గత కొన్నేళ్లలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో వందకు పైగా పోటీ పరీక్షల్లో పేపర్ లీక్‌లు లేదా అక్రమాల ఆరోపణలు వెలుగులోకి వచ్చాయని పలు జాతీయ మీడియా సంస్థలు, స్వతంత్ర విశ్లేషణలు పేర్కొన్నాయి. ప్రతి ఘటనకు ఒకే కారణం లేకపోయినా, పరీక్షా వ్యవస్థపై విద్యార్థుల నమ్మకం దెబ్బతినడం మాత్రం వాస్తవం. లక్షలాది మంది విద్యార్థులు సంవత్సరాలపాటు సిద్ధమవుతారు. ఒక పరీక్ష రద్దు కావడం అంటే కేవలం ఒక పరీక్ష వాయిదా పడడం కాదు; కుటుంబాల ఆర్థిక భారం, మానసిక ఒత్తిడి, భవిష్యత్తుపై అనిశ్చితి కూడా పెరుగుతాయి. ఈ నేపథ్యంలో రాజకీయ బాధ్యతపై చర్చ సహజంగానే ముందుకు వచ్చింది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో మంత్రి తన శాఖలో జరిగిన ప్రతి తప్పుకు వ్యక్తిగత నేరస్థుడు అవ్వాల్సిన అవసరం లేదు. అయితే శాఖలో వరుస వైఫల్యాలు చోటుచేసుకున్నప్పుడు నైతిక బాధ్యత వహించాలా అనే ప్రశ్న తలెత్తుతుంది. భారత రాజకీయ చరిత్రలో 1956 అరియలూర్ రైలు ప్రమాదం తరువాత రైల్వే మంత్రి లాల్ బహదూర్ శాస్త్రి రాజీనామా చేయడం నైతిక బాధ్యతకు ప్రతీకగా ఇప్పటికీ ప్రస్తావించబడుతుంది. అదే విధంగా వివిధ కాలాల్లో పలు కేంద్ర, రాష్ట్ర మంత్రులు తీవ్రమైన వివాదాలు లేదా పరిపాలనా వైఫల్యాల నేపథ్యంలో రాజీనామాలు చేశారు. మరోవైపు, ఆధునిక రాజకీయాల్లో "దర్యాప్తు పూర్తయ్యే వరకు రాజీనామా అవసరం లేదు" అనే వాదన కూడా బలపడింది. ఈ రెండు దృక్పథాల మధ్య సమతుల్యత ఎలా ఉండాలన్నది ప్రజాస్వామ్య చర్చకు సంబంధించిన అంశం. ఇటీవల కేంద్ర విద్యాశాఖ పనితీరు, పరీక్షల నిర్వహణ, విద్యార్థుల నిరసనల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్లు కొన్ని విద్యార్థి సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు, సామాజిక కార్యకర్తల నుంచి వినిపించాయి. ప్రభుత్వం మాత్రం పరీక్షా వ్యవస్థలో సంస్కరణలు చేపడుతున్నామని, చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొంటోంది. ఈ అంశంపై భిన్న రాజకీయ అభిప్రాయాలు ఉన్నప్పటికీ, విద్యార్థుల విశ్వాసాన్ని తిరిగి పొందేందుకు పారదర్శకత, బాధ్యులపై వేగవంతమైన చర్యలు, పరీక్షల భద్రతకు సాంకేతిక పరిష్కారాలు అత్యవసరమనే విషయంలో విస్తృత ఏకాభిప్రాయం కనిపిస్తోంది. సోనం వాంగ్చుక్ చేపట్టిన నిరాహార దీక్ష కూడా ఈ చర్చను మరింత విస్తరించింది. శాంతియుత నిరసనలు ప్రజాస్వామ్యంలో చట్టబద్ధమైన రాజకీయ వ్యక్తీకరణ రూపం. ప్రభుత్వాలు అలాంటి నిరసనలను చట్టవ్యవస్థ పరిమితుల్లో నిర్వహించాల్సిన బాధ్యత కలిగి ఉంటాయి. అదే సమయంలో ప్రజా శాంతి భద్రతలను కాపాడే బాధ్యత కూడా ప్రభుత్వానిదే. ఈ రెండు బాధ్యతల మధ్య సమతుల్యతే ప్రజాస్వామ్య పరిపక్వతకు సూచిక. బలప్రయోగం చివరి ప్రత్యామ్నాయంగా మాత్రమే ఉండాలని, ముందుగా చర్చలు, మధ్యవర్తిత్వం, సంభాషణకు ప్రాధాన్యం ఇవ్వాలని మానవ హక్కుల నిపుణులు తరచూ సూచిస్తున్నారు. ఇటీవల కొన్ని మీడియా కథనాల్లో ప్రభుత్వ రంగ సంస్థల సిఎస్ఆర్ నిధుల వినియోగంపై ప్రశ్నలు లేవనెత్తబడ్డాయి. అలాంటి ఆరోపణలు వెలువడినప్పుడు వాటిని నిజాలుగా స్వీకరించకుండా, స్వతంత్ర దర్యాప్తు సంస్థలు లేదా పార్లమెంటరీ పర్యవేక్షణ ద్వారా వాస్తవాలను నిర్ధారించడం ప్రజాస్వామ్య పద్ధతి. అలాగే సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న ప్రతి ఆరోపణను ధృవీకరించిన నిజంగా పరిగణించడం సరైంది కాదు. ఆధారాలు, అధికారిక విచారణలు, న్యాయపరమైన నిర్ధారణల ఆధారంగానే తుది నిర్ణయాలు ఉండాలి. విద్యార్థులకు ఈ పరిణామాలు ఒక ముఖ్యమైన పాఠాన్ని నేర్పుతున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం హక్కు. కానీ అదే సమయంలో వాస్తవాలను ధృవీకరించడం కూడా బాధ్యత. ప్రభుత్వం విమర్శలకు అతీతం కాదు; అలాగే ప్రతి ఆరోపణ కూడా నిరూపిత నిజం కాదు. అందువల్ల ఆధారాలు, రాజ్యాంగం, చట్టం, నైతికత అనే నాలుగు ప్రమాణాల ఆధారంగా ప్రజా విధానాలను అంచనా వేయడం ప్రజాస్వామ్య పౌరసత్వానికి అవసరం. భారతదేశానికి నేడు అత్యవసరంగా కావలసింది శక్తివంతమైన ప్రభుత్వం మాత్రమే కాదు; అంతే శక్తివంతమైన జవాబుదారీతనం కూడా. పోలీసు వ్యవస్థలో మానవ హక్కుల ఆధారిత సంస్కరణలు, పరీక్షా వ్యవస్థలో పారదర్శకత, మంత్రుల రాజకీయ బాధ్యత, స్వతంత్ర దర్యాప్తు వ్యవస్థలు, న్యాయస్థానాల పర్యవేక్షణ, స్వేచ్ఛాయుత మీడియా, చైతన్యవంతమైన పౌర సమాజం ... ఈ అన్నింటి సమన్వయంతోనే ప్రజాస్వామ్యం బలపడుతుంది. చివరికి ఏ ప్రభుత్వానికైనా అసలైన బలం ప్రజల విశ్వాసం. ఆ విశ్వాసాన్ని నిలబెట్టేది అధికారం కాదు; చట్టపాలన, పారదర్శకత, రాజ్యాంగ విలువల పట్ల నిబద్ధత మరియు జవాబుదారీతనమే.

# కాళేశ్వరం అవినీతి మరిచి కాంగ్రెస్ పై విమర్శలా ?

**బీఆర్ఎస్ ఆరోపణలు అవాస్తవమని మండల నాయకుల విమర్శ**

**వాస్తవం : ఎల్కతుర్తి**

మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ నాయకులు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాళేశ్వరం, కరెంట్, నిరుద్యోగం అంశాలపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని మండిపడ్డారు. పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టిన పార్టీకి ఇప్పుడు నీతులు చెప్పే హక్కు లేదన్నారు. కాళేశ్వరం పేరుతో వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేసి, ఇప్పుడు అదే అంశంపై కాంగ్రెస్‌ను ప్రశ్నించడం "దొంగే దొంగ దొంగ అని అరిచినట్లు" ఉందని ఎద్దేవా చేశారు. "ప్రజలు తిరస్కరించిన బీఆర్ఎస్‌కు ఇంకా వాస్తవాలు అర్థం కాలేదు. అబద్ధాలను వందసార్లు చెప్పినా అవి నిజాలు కావు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు" అని వ్యాఖ్యానించారు. పీసీసీ సభ్యుడు బొమ్మనపల్లి అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు ఉచిత విద్యుత్ అందించిన ఘనత కాంగ్రెస్‌కేనని గుర్తు చేశారు. ప్రస్తుతం రైతులకు నిరంతర విద్యుత్‌తో పాటు గృహ జ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. నిరుద్యోగ యువతను పదేళ్లపాటు మోసం చేసిన బీఆర్ఎస్, ఇప్పుడు ఉద్యోగాల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. "ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా కాలయాపన చేసిన వాళ్లు, ఇప్పుడు పారదర్శకంగా ఉద్యోగాలు భర్తీ చేస్తున్న



కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం హాస్యాస్పదం" అని విమర్శించారు. అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, బీఆర్ఎస్ అసత్య ప్రచారాలు, రాజకీయ డ్రామాలను ప్రజలు ఇక నమ్మే పరిస్థితిలో లేరని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షులు, కాంగ్రెస్ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సబ్ స్టేషన్లో సేఫ్టీకి తూట్లు

**హెల్మెట్ లేకుండానే రిపేర్లు**

**విధుల్లో ఓ ఉద్యోగి నిర్లక్ష్యం**

**పట్టించుకొని అధికార యంత్రాంగం**

**జగిత్యాల, జులై 21** వర్షాకాలంలో వీధి స్తంబాలను తాకరాదని ప్రజలకు జాగ్రత్తలు చెప్పే విద్యుత్ శాఖ ఉద్యోగులు తామే విధుల్లో నిర్లక్ష్యం వ హించి సబ్ స్టేషన్లో మరమ్మత్తులు చేసిన సంఘటన జగిత్యాల జిల్లా కేంద్రంలో చోటుచేసుకొంది. జగిత్యాల జిల్లా కేం ద్రంలో యావర్ రోడ్డు లోని విద్యుత్ ఆఫీస్ వెనుక గల టౌన్ 1 సబ్ స్టేషన్లో మంగళవారం మరమ్మత్తులు చేపట్టారు. ఈ రిపేర్ పనుల్లో దాదాపు పది మందికి పైగానే ఉద్యోగులు పని చేసినట్లు తెలిసింది. ఇందులో కొందరు అధికారుల పర్యవేక్షణలో ఈ రిపేర్ పనులను చేపట్టగా ఇందులో దాదాపుగా అందరూ ఉద్యోగులు సేఫ్టీ మెథడ్స్ పాటిస్తూ హెల్మెట్ ధరించి మరమ్మత్తు పనుల్లో పాల్గొన్నట్లు తెలిసింది. ప్రధానంగా సబ్ స్టేషన్ విద్యుత్ నిల్వ ఉంచే ట్రాన్స్ ఫార్మర్ రిపేర్ పనిలో ఓ ఉద్యోగి నిర్లక్ష్యం వెలుగు చూసింది. ట్రాన్స్ ఫార్మర్ పై రిపేర్ చేసే సమయంలో అ ఉద్యోగి హెల్మెట్ తొలగించి మరో పరికరముపై పెట్టి పనులను చేస్తున్న దృశ్యం స్థానికుల కంటపడి విమర్శలకు దారి తీసింది. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు ఉద్యోగుల రక్షణ, భద్రత అంశంలో జాగ్రత్తలు తీసుకోవాలంటూ



నిత్యం ఆదేశాలు ఇస్తూనే ఉన్నారు. అలాగే వర్షాకాలంలో విద్యుత్ స్తంబాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పే విద్యుత్ ఉద్యోగులే కరెంట్ పనుల్లో నిర్లక్ష్యం వహించడం సరికాదని సంబం ధిత ఉన్నతాధికారులు స్పందించి ఇలాంటి సంఘటనలు జరుగకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## వివాహిత మహిళ మృతికి కారణమైన వ్యక్తి అరెస్ట్

**చందుర్తి సిఐ కట్ల రవీందర్**



**వాస్తవం : చందుర్తి :** వివాహిత మహిళ మృతికి కారణమైన వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చందుర్తి సిఐ కట్ల రవీందర్ తెలిపారు. చందుర్తి సిఐ కట్ల రవీందర్ వివరిస్తూ....చందుర్తి పోలీస్ సర్కిల్ పరిధిలోని రుద్రంగి మండల కేంద్రానికి చెందిన బాధవేణి కావ్య ఫిబ్రవరి 19 కనిపించడం లేదంటూ ఫిర్యాదు అందగా, రుద్రంగి పోలీస్ స్టేషన్‌లో 'ఉమెన్ మిస్సింగ్' కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగింది. విచారణలో భాగంగా మార్చి 2 న పెద్దపల్లి జిల్లా జూలపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వాటర్ కెనాల్‌లో లభించిన గుర్తుతెలియని మృతదేహాన్ని జూలపల్లి పోలీసుల సహాయంతో గల్లంతైన బాధితురాలు బాధవేణి కావ్యగా గుర్తించడమైనది. బంధువుల వాంగ్మూలాలు, కాల్ డేటా ఆధారంగా విచారించగా.. అదే గ్రామానికి చెందిన సూర యాదయ్య తనను శారీరకంగా లొంగదీసుకోవాలని ఫోన్‌లో తీవ్రంగా వేధించినట్లు నిర్ధారణ అయింది. బాధితురాలు, ఆమె కుటుంబ సభ్యులు ఎంత వారించినా అతను వేధింపులు ఆపకపోవడంతో ఆ మానసిక క్షోభ భరించలేక ఆమె ఆత్మహత్య చేసుకుంది. నేరం రుజువు కావడంతో, నిందితుడు సూర యాదయ్యను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

## సనుగుల ప్రభుత్వ పాఠశాలకు చేరిన కంప్యూటర్స్‌లు




**జనోదయ : చందుర్తి :**

చందుర్తి మండలం సనుగుల గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించడా నికోసం తెలంగాణ విద్యాశాఖ నాలుగు కంప్యూటర్స్‌లను మంగళవారం పాఠశాలకు అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపా ధ్యా యులు కట్కూరి ముఖేష్ మాట్లాడుతూ నేటి డిజిటల్ యుగంలో విద్యార్థులు కాలాను గుణంగా అభివృద్ధి చెందేం దుకు సాంకేతిక విద్య ఎంతో అవసరమని, ఈ నేపథ్యంలో విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం, డిజిటల్ లిటరసీ, ఇంటర్నెట్ వినియోగం, కోడిం గ్, కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్ వంటి ఆధునిక సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహించేందుకు శిక్షణ ఇచ్చేందుకు విద్యార్థుల్లో సృజనాత్మ కత, సమస్య పరిష్కార నైపుణ్యాలు, తార్కిక ఆలోచన, ఆవిష్కరణ దృక్పథం పెంపొం దించే దిశగా భవిష్యత్తులో ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు అవసరమైన డిజిటల్ నైపుణ్యాలు వారికి అలవడతాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సర్పంచ్ బొడిగె లావణ్య-అనిల్, ఉపసర్పంచ్ శెనిగరపు స్వామి, ఉపాధ్యాయులు మేకల పద్మ, చింతల హరిష్మ, ప్రిప్రైమరీ ఉపాధ్యాయులు దుంపెట మమత, విద్యార్థులు పాల్గొన్నారు.

## నారుమళ్లకు నీరు ఇవ్వకుంటే

# రైతులు రోడ్డెక్కుతారు

**చర్ల తాళిపేరు గేట్లు తెరవాలి... గోదావరిలోకి వదలొద్దు**

**ఎస్ ఈ కి వినతిపత్రం అందజేసిన నాయకులు**

**వాస్తవం : చర్ల**



నారుమళ్లకు, నాట్లకు నీరు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే తాళిపేరు ప్రాజెక్టు నుండి నీటిని విడుదల చేయాలని చర్ల మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఇరిగేషన్ శాఖను డిమాండ్ చేశారు. ఇరిగేషన్ జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయంలో సీనియర్ నాయకులు ఇందల రమేష్, ఆర్.కొత్తగూడెం సర్పంచ్ తుర్రం రవికుమార్, వార్డు మెంబర్ కారం సుధాకర్ ఎస్ ఈ ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం తాళిపేరు ప్రాజెక్టులో నీటిమట్టం 73 అడుగుల వద్ద ఉందని, పైన వర్షాలు పడుతున్నందున మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపారు. "మెయిన్ గేట్లు తెరిచి నీటిని గోదావరిలోకి వదిలేయకుండా, వచ్చే నీటిని ఎడమ, కుడి కాలువల ద్వారా రైతుల నారుమళ్ల కోసం ఉపయోగించాలి" అని కోరారు. "ప్రతి సంవత్సరం ఈ నీటితోనే వేలాది ఎకరాల్లో పంటలు పండుతున్నాయి. సమయానికి నీరు ఇవ్వకపోతే రైతుల కష్టం మొత్తం బూడిదలో పోసిన పన్నీరు అవుతుంది. అధికారులు వెంటనే స్పందించి నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలి" అని వారు విజ్ఞప్తి చేశారు. అధికారులు సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నీటి విడుదలలో జాప్యం జరిగితే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని నాయకులు హెచ్చరించారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా అక్షరాభ్యాసం, అన్నప్రాసన

**వాస్తవం : మద్దూరు**



మండల పరిధిలోని గాగిళ్లపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం రోజు పిల్లలకు యూనిఫామ్ పంపిణీతో పాటు, అక్షరాభ్యాసం మరియు అన్నప్రాసన కార్యక్రమాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గ్రామ సర్పంచ్ ఇట్టబోయిన కనక చంద్రం తన చేతుల మీదుగా చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన చేయించి, విద్యార్థులకు ఉచితంగా యూనిఫామ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కనక చంద్రం మాట్లాడుతూ..గర్భిణులు, బాలిం తలు మరియు చిన్న పిల్లల శారీరక,మానసిక ఎదుగుదలకు అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతో దోహదపడుతున్నాయని కొనియాడారు. ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న బాలామృతం,కోడిగుడ్లు, పాలు తదితర పౌష్టికాహార పదార్థాలను తల్లులు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. పిల్లలు ఆరోగ్యంగా, దృఢంగా ఉండేందుకు ఈ పోషకాహారం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ గుడిసె అరుణ జ్యోతి, స్థానిక ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరి ప్రసాద్,వార్డు సభ్యులు,అంగన్‌వాడీ ఆయా,అలాగే పిల్లల తల్లులు, గ్రామస్థులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పల్లేటి జనార్ధన్ కుటుంబానికి క్రౌడ్ ఫండింగ్ ద్వారా ఆర్థిక సహాయం



**వాస్తవం : మాడుగుల**

మాడ్గుల మండలం అప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన పల్లేటి జనార్దన్ అకాల మరణం చెందటంతో వారి కుటుంబానికి మేమున్నామని ధైర్యానిచ్చేందుకు అప్పారెడ్డిపల్లి గ్రామావాసులు, చుట్టుపక్క గ్రామస్థులు, మానవతావాదులు. బీఆరెస్ పార్టీ నాయకులు తమకు వీలైనంత క్రౌడ్ ఫండింగ్ ద్వారా విరాలిచ్చి , మొత్తం 1,16,511 రూపాయలు సేకరించి జనార్దన్ భార్య కవిత కు దాతల వివరాలను ఇచ్చి, వారి పేరున ఫిక్సడ్ డిపాజిట్ చేయనున్నట్లు తెలిపారు. ఈ క్రౌడ్ ఫండింగ్ కి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ 5000, దీనికి అదనంగా అంత్యక్రియల రోజు పాపిశెట్టి రాము 5000, ఉప్పల వెంకటేష్ 3000, గోవిందు శ్రీధర్ 2000, దివంగత బీఆరెస్ నాయకుడు డాక్టర్ రామిరెడ్డి కుటుంభం 5000 జనార్దన్ భార్య కవితకు అందచేశారు. ఈ కార్యక్రమంలో గోవిందు నరేందర్, అప్పారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ తోట చంద్రయ్య, పల్లేటి యాదయ్య, తోట పాపయ్య, తెలుగు చంద్రయ్య, అడవి రాములు, పల్లేటి నర్సింహా, ప్రకాష్,పాలది సైదులు, వరుణ్. క్రౌడ్ ఫండింగ్ కార్యక్రమ నిర్వాహకుడు గోవిందు శ్రీధర్ పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా గోరింటాకు వేడుకలు




**వాస్తవం : మద్దూరు**

మండలం పరిధిలోని నర్సాయిపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో ఆషాఢ మాసం సందర్భంగా గోరింటాకు వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ శనిగరం సత్యనారాయణ, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి భార్గవి, అంగన్‌వాడీ టీచర్ జి.శ్రీమతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి భార్గవి మాట్లాడుతూ..ఆషాఢ మాసంలో మహిళలు ఎంతో ఇష్టంగా చేతులకు గోరింటాకు పెట్టుకుంటారని,ఈ సాంప్రదాయాన్ని కొనసాగించేందుకు గాను కేంద్రంలో ఈ వేడుకలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు, తల్లులు మరియు చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## గోరింటాకు వేడుకల్లో కందుల సంధ్యారాణి



**వాస్తవం, గోదావరిఖని, జులై,21**

శ్రీ లక్ష్మీ గణపతి మిత్ర మండలి ఆధ్వర్యంలో మార్కండేయ కాలనీలో అత్యంత వైభవంగా నిర్వహించిన గోరింటాకు వేడుకలు మహిళల సందడి, సంప్రదాయ కళా వైభవంతో ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలకు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీమతి కందుల సంధ్యారాణి, ముఖ్య అతిథిగా హాజరై మహిళలతో కలిసి గోరింటాకు పెట్టించుకొని, వారి ఆనందోత్సాహాల్లో భాగస్వామ్యమయ్యారు. ఈ సందర్భంగా కందుల సంధ్యారాణి మాట్లాడుతూ, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు మహిళల చేతుల మీదుగా తరతరాలకు చేరుతున్నాయని పేర్కొన్నారు. గోరింటాకు వంటి సాంప్రదాయ వేడుకలు మహిళల మధ్య ప్రేమ, ఆప్యాయత, ఐక్యతను పెంపొందించడమే కాకుండా కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. ఆధునిక జీవనశైలిలో కూడా మన సంప్రదాయాలను కాపాడుకుంటూ యువతకు వాటి గొప్పతనాన్ని పరిచయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం మహిళలతో కలిసి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలు, సంప్రదాయ గీతాలు, వినోద కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొని అందరినీ అలరించారు. మహిళలతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. మహిళలు ఆమెకు ఘన స్వాగతం పలికి జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గుర్రం వీణ, బైరి శ్రీదేవి, గడ్డం ధనశ్రీ, వంగల స్వాతి, బి. శ్రీలత, తాజంపురం సంధ్యారాణి, జక్కన రాజమణి, రమ్య, రాధిక, సాయి ప్రియ, భైరభట్ల సారథి, ఓదెల పద్మావతి, నడిపెల్లి అంజలి, కొక్కుల అనిత, దేవునూరి స్వప్నతో పాటు మార్కండేయ కాలనీకి చెందిన మహిళలు, యువతులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం
Red 914/2015
జర్నలిస్ట్స్ సంక్షేమమే పరమావధిగా
జర్నలిస్ట్స్ హక్కుల కోసం....
వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...
సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110

Publisher, Editor and Owned by Manasani Krishna Reddy, H No 4-81/1, Ramagundam, Elkalpalli, Karimnagar, Telangana - 505208.
Cell No - 8074124190 Editor : MANASANI KRISHNA REDDY

# జైపూర్ ఎస్టిపిపిలో మెగా ప్లాంటేషన్

వాస్తవం : జైపూర్, జూలై 21



మంచిర్యాల జిల్లా జైపూర్ మండల కేంద్రంలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్(ప్రభుత్వ రంగ సంస్థ) కమ్యూనికేషన్ సెల్, ఎస్టిపిపి ఏరియా ఎస్టిపిపిలో మెగా ప్లాంటేషన్ ప్రోగ్రాంను బొగ్గు మంత్రిత్వ శాఖ మరియు దాని అనుబంధ సంస్థ కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్ వారి ఆదేశాల మేరకు సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ ) దిశా నిర్దేశంలో సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రంలో మెగా ప్లాంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డైరెక్టర్ (పిపి) కె. వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా డైరెక్టర్ కె. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సింగరేణి సంస్థ భూమి నుండి బొగ్గు తీయడమే కాకుండా విద్యుత్ ఉత్పత్తి చేస్తు దేశ మరియు రాష్ట్ర అవసరాలకి బొగ్గు మరియు విద్యుత్ సరఫరా చేస్తూ దేశ మరియు రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడుతుందని తెలిపారు. పర్యావరణానికి బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాల వల్ల జరిగే నష్టాన్ని తగ్గించడం కోసం పర్యావరణహిత చర్యగా ఏటా సింగరేణి సంస్థ తమ పని ప్రదేశాలలో మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహిస్తున్నదని తెలిపారు. దీనిలో భాగంగా మెగా ప్లాంటేషన్ ప్రోగ్రాం నిర్వహించామన్నారు. దీని ద్వారా పర్యావరణము ఎంతో కొంత సమతుల్యం ఏర్పడుతుందన్నారు. అనంతరం డైరెక్టర్ మరియు వివిధ అధికారులు మరియు ఉద్యోగులు పెద్ద మొత్తంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్లాంటు ఈడి సిహెచ్ చిరంజీవి, జీఎం ఎస్టిపిపి ఎం నరసింహ రావు, జీఎం(పిసిఎస్) మదన్ మోహన్, ఎజిఎం సూర్యనారాయణ రాజు, ఎజిఎం, వివి సుధాకర్ రెడ్డి, ఎజిఎం (ఫైనాన్సు) బి శ్రీధర్, ఏఐటియుసి ఫిట్ సెక్రటరీ సత్యనారాయణ, సిఎంఓఎఐ బ్రాంచ్ ప్రెసిడెంట్ డి పంతులా, ప్లాంట్ కోఆర్డినేటర్ఎం.వి. వేణుగోపాల్, డిజీఎం (ఎన్విరాన్మెంట్) వాసుదేవ మూర్తి, పర్సనల్ విభాగాధిపతి ఎస్వి రాజేశ్వర్ రావు , మేనేజర్ ఫారెస్ట్ చంద్రమణి అధికారులు పాల్గొన్నారు.

# లక్షెట్టిపేటలో బీఆర్ఎస్ రైతు సదస్సు

### రైతు కుటుంబాలకు చెక్కులు పంపిణీ చేసిన కేటీఆర్

వాస్తవం,లక్షెట్టిపేట,జూలై 21



మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటలో రైతు సదస్సుకు హాజరై ప్రభుత్వ అసమర్థత కారణంగా చనిపోయిన నలుగురు రైతు కుటుంబాలకు ప్రతి కుటుంబానికి 5 లక్షల రూపాయలు చొప్పున నాలుగు కుటుంబాలకు బీ ఆర్ ఎస్ పార్టీ తరపున చెక్కులు అందజేసిన తెలంగాణ టిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు మాజీ మంత్రి కల్వకుంట్ల రామారావు.మంచిర్యాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు అధ్యక్షతన మరియు చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే మరియు మంచిర్యాల జిల్లా బీ ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు బాల్క సుమన్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మరియు వివిధ నియోజకవర్గాల మాజీ మంత్రులు మరియు మాజీ ఎమ్మెల్యేలు మాజీ ఎమ్మెల్సీలు హాజరైయారు.కేటీఆర్ మాట్లాడుతూ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కారణంగా రైతులు తమ ధాన్యాన్ని అమ్మే క్రమంలో అకాల వర్షం కారణంగా గోడకూలి నలుగురు రైతులు దుర్మరణం చెందడం జరిగింది.ఆ నలుగురు రైతు కుటుంబాలకు బి ఆర్ ఎస్ పార్టీ తరపున తెలంగాణ తొలి ముఖ్యమంత్రివర్యులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఆదేశాల మేరకు మంగళవారం కేటీఆర్ 5 లక్షల రూపాయల చెక్కులు రైతు కుటుంబాలకు అందజేయడం జరిగింది.అలాగే ఈ ప్రభుత్వ వైఫల్యాలను మరియు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మీరు వచ్చే అవకాశం ఉన్న రైతులకు నీళ్లు ఇవ్వకుండా రైతులను కష్టాలపాలు చేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చే రోజుల్లో తగు గుణపాఠం చెప్పాలని మళ్లీ మన కేసీఆర్ ఏ ముఖ్యమంత్రి అవుతారని తర్వాత రైతులకు మంచి రోజులు వస్తాయని భరోసా కల్పించారు. ఈ రైతు సదస్సు సభకు వివిధ నియోజకవర్గాల నుండి బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేశారు.మంచిర్యాల జిల్లా, గూడెం గుట్ట శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వారితో పాటు కోరుట్ల ఎమ్మెల్యే డా. సంజయ్, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, కోరుకంటి చందర్, నడిపెల్లి దివాకర్ రావు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మీ భద్రతే మా ధ్యేయం

### ఉప్పల్ రింగ్‌రోడ్డులో 'హెల్మెట్ బ్యాంక్' ప్రారంభించిన ట్రాఫిక్ పోలీసులు

వాస్తవం, జూలై 21, గ్రేటర్ హైదరాబాద్



చలానాలు కాదు, వాహనాదారుల భద్రత, వారి ప్రాణాల రక్షణే మాధ్యేయమన్నారు ఉప్పల్ ట్రాఫిక్ పోలీసులు. హెల్మెట్ ధరించకుండా ప్రయాణించే టూ వీలర్స్ కు 24 గంటల పాటు ఉచితంగా హెల్మెట్ వినియోగించుటకు మల్కాజిగిరి కమిషనరేట్ పోలీస్ కమిషనర్ సుమతి ఆదేశాల మేరకు, ట్రాఫిక్-2 డీసీపీ వి. శ్రీనివాసులు పర్యవేక్షణలో, ఉప్పల్ ట్రాఫిక్ డివిజన్ ఏసీపీ సం పత్ కుమార్ ఆధ్వర్యంలో ఉప్పల్ రింగ్ రోడ్డులో సోమవారం 'హెల్మెట్ బ్యాంక్' ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ బ్యాంక్ నుంచి ఎలాంటి రుసుము చెల్లించకుండా 24 గంటల పాటు హెల్మెట్ తీసుకుని వినియోగించుకోవచ్చని తెలిపారు. అనంతరం స్వంతంగా హెల్మెట్ కొనుగోలు చేసి, తీసుకున్న హెల్మెట్‌ను 24 గంటల్లోపు తిరిగి బ్యాంక్‌కు అందజేయాలని తెలిపారు. చలానాలు విధించడం కంటే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించే అలవాటు పెంపొందించి రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టాన్ని తగ్గించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, హెల్మెట్ ధరించడం ప్రతి వాహనదారుడి ప్రథమ బాధ్యత అని సూచించారు. హెల్మెట్ బ్యాంక్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఉప్పల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు జి. నాగరాజు, గోవర్ధన్‌తో పాటు తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# సమాజ చైతన్యానికి పాత్రికేయుల సేవలు అమూల్యం

### ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్



వాస్తవం : గోదావరిఖని

గోదావరిఖని ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన "జోహార్ కామ్రేడ్ మునీర్ (ప్రొలిటేరియన్ జర్నలిస్ట్)" పుస్తక పరిచయ సభలో రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ... సమాజంలో చైతన్యం తీసుకురావడంలో, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకు రావడంలో పాత్రికేయులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నా రు. ప్రజల పక్షాన నిలబడి కలాన్ని ఆయుధంగా చేసుకుని పోరాడిన కామ్రేడ్ మునీర్ జీవితం, ఆయన విలువలు భావి తరాలకు స్ఫూర్తినిచ్చే విధంగా ఈ పుస్తకం రూపొందిందని కొనియాడారు. ఇటువంటి గ్రంథాలు సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సభా ధ్యక్షులు రామూర్తి, రియాజ్ అహ్మద్, వెంకట్రావు, శేఖర్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, ట్రేడ్ యూనియన్ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, పాత్రికేయులు, ప్రజా ప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

### పాలకీడు

### నూతన పోలీస్ స్టేషన్

# భవన పరిశీలన

### సీఐ గజ్జె చరమందరాజు



వాస్తవం : పాలకీడు :

మండల ప్రజలకు శాంతిభద్రతల పరిరక్షణకు ఇది ఎంతో శుభపరిణామం.నూతన పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి సంబంధించి, రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం హుజూర్ నగర్ సీఐ గజ్జె చరమంద రాజు స్థానిక ఎస్ఐతో కలిసి పోలీస్ స్టేషన్ కొరకు ప్రతిపాదిత స్థలాన్ని మరియు భవన డిజైన్లను ప్రత్యక్షంగా పరిశీలించారు.రెండు ఎకరాల విస్తీర్ణంలో, రెండు కోట్ల ముప్పై ఎనిమిది లక్షల రూపాయల (2.38 కోట్లు) అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టిన ఈ నూతన పోలీస్ స్టేషన్ భవనంతో పాలకీడు మండల ప్రజల సుదీర్ఘకాల నిరీక్షణ ఫలించబోతోంది.ఆధునిక వసతులతో, విశాలమైన రెండు ఎకరాల ప్రాంగణంలో నిర్మించబోయే ఈ నూతన పోలీస్ స్టేషన్ భవనం అందుబాటులోకి వస్తే మండలంలో పోలీసు సేవలు ప్రజలకు మరింత చేరువవుతాయని, శాంతిభద్రతలు మరింత మెరుగ్గా అమలు జరుగుతాయని ఈ అక్టోబర్ నెల లో పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవం జరిపేలా ప్రణాళికా సిద్ధం చేసినట్టు హుజూర్ నగర్ సీఐ చరమంద రాజు తెలియజేశారు,ఈ సందర్భంగా స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## వార్తలు చదవడం తేలికే...

# రాయడమే కష్టం

**ఏది వార్తనో ఏది వార్త కాదో ముందుగా తెలుసుకోవాలి**

కొత్త ,వింత, ఆసక్తికర, తాజా సమాచారమే వార్త.వార్తలు చదవడం తేలికే. కానీ రాయడమే సులువుకాదు.దానికి సాధన అవసరం.ఏది వార్తనో ఏది వార్త కాదో ముందుగా తెలుసుకోవాలి.దీనికోసం నిత్యం వార్త పత్రికలను చదవాలి. మంచి పుస్తకాలను చదివి అందులో ఉన్న పద సంపదను అర్థం చేసుకోవాలి.

వార్తల రకాలు

దినపత్రికల్లో వచ్చే వార్తల్లో రెండు రకాలు ఉంటాయి.

1. తాజావార్తలు (స్పాట్‌న్యూస్)
2. వార్తా కథనాలు(స్టోరీస్)

**తాజావార్తలు :** రోజువారి జరిగే సంఘటనలను యథాతథంగా నివేదిస్తే అవి తాజా వార్తలు. వీటిలో విలేకరి సొంత అభిప్రాయాలకు తావు ఉండరాదు. సాధ్యమైనంత వరకు ప్రత్యక్షంగా చూసి, విని రాయాల్సి ఉంటుంది. ఒకవేళ సంఘటనా స్థలంలో ప్రత్యక్షంగా లేకుంటే విశ్వసనీయ వ్యక్తుల ద్వారా రూఢి చేసుకుని 'వారి కథనం మేరకు' అని ప్రస్తావించాలి.

తాజా వార్తల్లో వివిధ రకాలుగా ఉన్నాయి..సాధారణ వార్తలు,నేర వార్తలు,న్యాయ వార్తలు,క్రీడా వార్తలు,వ్యవసాయ వార్తలు,వాతావరణ వార్తలు, వాణిజ్యవార్తలు,విద్యా వార్తలు, ఉద్యోగ వార్తలు, వైద్య వార్తలు, శాస్త్రసాంకేతిక వార్తలు, రాజకీయ వార్తలు ఇలా అనేక రకాలుగా ఉంటాయి.

**వార్తా కథనాలు :** తాజా వార్తలతోపాటు వార్తా కథనాలకు పత్రికలు పెద్ద పీట వేస్తున్నాయి.కథనాల ద్వారా ప్రజా సమస్యలను, అవినీతి అక్రమాలను, అన్యాయాలను పాఠకులతోపాటు పాలకుల దృష్టికి తీసుకొచ్చి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నాయి. తాజా వార్తల కోసం విలేకరి పెద్దగా శ్రమించాల్సిన పనిలేదు. సంఘటన జరిగినది జరిగినట్లుగా నివేదిస్తే సరిపోతుంది. కానీ వార్త కథనాల విషయంలో విలేకరి సామర్థ్యానికి గీటురాయిగా ఉంటుంది.


**వార్త కథనాలు రకాలు:**

ఘటన ఆధారిత కథణాలు: ఏదైనా సంఘటన జరిగినప్పుడు దాని ఆధారంగా రాసే విశ్లేషణాత్మక కథనాలను ఘటన ఆధారిత (స్పాట్ ఓరియంటెడ్) కథనాలు అంటారు.

**మానవీయ కథనాలు :** హృదయాలను కదిలించే, కరిగించే వార్తలన్నింటిని మానవీయ కథనాలు (హ్యూమన్ ఇంట్రెస్టింగ్) అంటారు.బాధితులు, దీనులు, అభాగ్యుల గోసను అక్షరీకరించాలి.

**పరిశీలనాత్మక కథనాలు:** యథార్థ పరిస్థితులను స్వయంగా పరిశీలించి నివేదించాలి.క్షేత్రస్థాయిలో జరుగుతున్న అభివృద్ధి పనుల తీరుతెన్నుల, వివిధ అంశాల్లో చోటుచేసుకుంటున్న లోపాలు, కష్టనష్టాలను ఉన్నది ఉన్నట్లుగా నివేదించాలి.

**పరిశోధనాత్మక కథనాలు:** ప్రభుత్వ, ప్రైవేటు వ్యవస్థల్లో అవినీతి,అక్రమాలు, నాణ్యత లేమి తదితర ఎన్నో విషయాలను పరిశోధనాత్మక కథనాల రూపంలో రాయవచ్చు. స్టింగ్ ఆపరేషన్ కూడా ఇదే కోవలోకి వస్తుంది. అయితే పరిశోధనాత్మక కథనాలు రాసే సందర్భంలో సరియైన ఆధారాలు ఉండాలి. అలా లేని పక్షంలో న్యాయస్థానాల చిక్కులను ఎదుర్కోవాల్సి ఉంటుంది. కావున ఈ అంశంలో కథనాలు రాసేవారు సమగ్రంగా పరిశీలించి పరిశోధించి ఆధారాలను సేకరించి న్యాయసంబంధ చిక్కులను ఎదర్కోకుండా కథనాలను రాయాల్సి ఉంటుంది.




**వార్త నిర్మాణం:**

వార్త నిర్మాణం చాలా ముఖ్యమైనది. వార్త నిర్మాణం ఈ విధంగా ఉంటుంది

1.శీర్షిక (హెడింగ్)
2.ఉప శీర్షిక( సబ్‌హెడింగ్)
3.ఉపోద్ఘాతం (లీడ్)
4.ప్రధాన భాగం

స్పాట్ వార్తల్లో ఈ క్రింది ప్రశ్నలకు సమాధానం ఖచ్చితంగా ఉండాలి

**1.ఏం జరిగింది?**
**2.ఎక్కడ జరిగింది?**
**3.ఎప్పుడు జరిగింది?**
**4.ఎవరికి జరిగింది?**
**ఎవరి ప్రమేయం ఉంది?**
**5.ఎందుకు జరిగింది?**
**6. ఎలా జరిగింది?**

**మానసాని కృష్ణా రెడ్డి**
**9618616110**
**8074124190**

## వార్తకు లీడ్ అనేది ప్రాణం..

# లీడ్ లేని వార్త ప్రాణం లేని దేహం వంటిదే

వార్తకు లీడ్ అనేది ప్రాణం.లీడ్ లేని వార్త ప్రాణం లేని దేహం వంటిదే. లీడ్‌ని గుర్తించడంలోనే విలేకరి ప్రావీణ్యత తెలిసిపోతుంది. అసలు లీడ్ అంటే ఏంటి?..వార్త కూర్పులో అనేక అంశాలు, అంగాలు ఉంటాయి. అందులో లీడ్ ఒకటి.

**వార్త నిర్మాణం:**

వార్త నిర్మాణం చాలా ముఖ్యమైనది.వార్త నిర్మాణం ఈ విధంగా ఉంటుంది

1.శీర్షిక (హెడ్డింగ్)
2.ఉప శీర్షిక( సబ్‌హెడ్డింగ్)
3.ఉపోద్ఘాతం (లీడ్)
4.ప్రధాన భాగం

అంటే ఒక వార్తలోని ముఖ్య సారాంశమే లీడ్. లీడ్ మీద ఆధారపడే ఆ వార్తను పాఠకులు చదువుతారు. ఉదాహరణకు ఒక ఒక శాసనసభ్యుడు ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు అనుకుంటే.. ఆయన ఆ కార్యక్రమంలో .. అనేక అంశాలను మాట్లాడుతుంటారు. రాష్ట్ర ముఖ్యమంత్రిని ప్రశంసిస్తారు..వివిధ ప్రభుత్వ పథకాలపైన మాట్లాడుతుంటారు.ప్రతిపక్షాలను విమర్శిస్తారు..మాటల్లో మాటగా ' ఇవే నాకు చివరి ఎన్నికలు...ఈ ఒక్కసారి నాకు మద్దతు ఇవ్వండి' అన్నారు అనుకుందాం. అలాంటప్పుడు మొదట సమావేశంలో ఎంఎల్ఏ మాట్లాడిన విషయం అంతా పక్కకు పోయి చివరగా చేసిన వ్యాఖ్యలే లీడ్‌గా మారిపోతుంది. ఎందుకంటే మొదట మాట్లాడిన విషయం అంతా రోజూ ఆయన చెప్పే విషయాలే.అందులో వైవిధ్యం,ఆసక్తి,నూతనత్వం అనేది లేదు. కానీ చివరగా ' ఇవే నాకు చివరి ఎన్నికలు..ఈ ఒక్కసారి మద్దతు ఇవ్వండి' అనే విషయం కొత్తది.అందులో ఆసక్తి ఉన్నది. అందుకే ఆ విషయాన్నే లీడ్‌గా తీసుకుని వార్తను కూర్చు చేయాలి. అనంతరం సమావేశం మొదట్లో మాట్లాడిన విషయాలు క్రమ పద్ధతిలో రాయాలి. అంటే సమావేశంలో ఒక విలేకరి ప్రత్యక్షంగా పాల్గొని సమావేశం చివరి వరకు పాల్గొన్నప్పుడే ఇలాంటి లీడ్ దొరికే అవకాశం ఉన్నది. అంటే ఒక శాసనసభ్యుడు ఈ ఎన్నికలతో రాజకీయాల నుంచి తప్పుకుంటున్నారని ఇక మీదట ఆయన ఎన్నికల్లో పోటీ చేయడం లేదనే విషయంపై పాఠకుల ఆసక్తి తప్పక ఉంటుంది కావున ఆ విషయాన్నే లీడ్‌గా తీసుకోవాల్సి ఉంటుంది. అయితే సదరు శాసనసభ్యుడు సమావేశం చివరలో ' ఇవే నాకు చివరి ఎన్నికలు..ఈ ఒక్కసారి మద్దతు ఇవ్వండి' అనే విషయాన్ని మాట్లాడి ఉండకపోయి ఉంటే సమావేశం మొదట్లో మాట్లాడిన మరో ముఖ్య విషయం లీడ్ అయి ఉండేది. అంటే దీనర్థం..లీడ్ అనేది ఆయా కార్యక్రమాలు, ఘటనల మీద ఆధారపడి ఉంటుందన్న మాట. అయితే విలేకరి స్వయంగా ఏదైనా కార్యక్రమం లేదా క్షేత్రస్థాయిలో పరిశీలించి, స్వయంగా విని నివేదించే సందర్భంలో మాత్రమే పాఠకులను ఆకర్షించే లీడ్‌లు దొరుకుతాయి. సరియైన లీడ్ దొరికిందంటే ఆ వార్త స్వరూపమే మారిపోతుంది. అలాంటి వార్తలకు పాఠకులను ఆకర్షించే శక్తి ఉంటుంది. అందుకే విలేకరి ఎప్పుడూ స్వయంగా తను కార్యక్రమాలకు హాజరవుతూ తను విని వార్తను నివేదించినప్పుడు ఆకర్షణీయమైన వార్తలు, నాణ్యమైన వార్తలు పాఠకులకు అందించగలుగుతారు.

అంటే ఒక వార్తకు లీడ్ అనేది గుండెలాంటిది. అందుకే విలేకరులు ఏదైనా సమావేశం లేదా కార్యక్రమంలో ఆసాంతం ఒపికగా, ఆసక్తిగా,ఏకాగ్రతతో పాల్గొనే సందర్భంలో లీడ్‌ని తేలిగ్గా గుర్తించగలుగుతారు. ఒక వార్తకు లీడ్ దొరికితే ఆ వార్త ప్రాణం పోసుకుని పూర్తి రూపాన్ని సంతరించుకుని జీవత్వాన్ని పొంది పాఠకుల మదిని చేరగలుగుతుంది.